

ఎక్కడ విఫలమయ్యాం?

జన సమీకరణలో ఎలా చతికిలపడ్డాం



సంగివలసలో శనివారం జరిగిన సిద్ధం సభలో కనిపించని జనం

సిద్ధం సభపై వైసీపీ నేతల పోస్టుమార్టం

- జిల్లా నుంచి ఆశించిన స్థాయిలో ప్రజలను తరలించ లేకపోయామని ఆవేదన
- ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు వేలు అనుకుంటే రెండు వేలు మించలేదు
- కేటాయించిన బస్సుల్లో కొన్ని ఐదు, పదిమంది తోనే వెళ్లాయి
- సమస్యను అధిగమించకపోతే అధినేతతో అంక్షితలు తప్పవు
- ఆంతరంగిక సమీక్షలో నాయకుల నిట్టూర్పు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

'సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావించిన 'సిద్ధం' సభకు కనీసం మూడు లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ గట్టిగా 30 వేలు దాటి జనాలను తీసుకురాలేకపోయాం. 15 రోజుల నుంచి జన సమీకరణపై కసరత్తు, సమీక్షలు నిర్వహించినా ప్రయోజనం లేకపోయింది. కేటాయించిన బస్సులను కొన్నిచోట్ల జనాలతో నింపలేకపోయాం. లోపం ఎక్కడ జరిగింది. దీనిని గుణపాఠంగా తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి అనుభవం ఎదురవకుండా జాగ్రత్తపడకపోతే అధినేతతో అంతా అక్షింతలు వేయించుకోవాల్సిందే.' ఇదీ శనివారం సంగివలస వద్ద జరిగిన వైసీపీ ఉత్తరాంధ్ర కార్యకర్తల సభపై వైసీపీ నేతల ఆంతరంగిక సమీక్షలో వ్యక్తంచేసిన అభిప్రాయాలు.

సార్వత్రిక ఎన్నికలకు ప్రచారానికి ఉత్తరాంధ్ర నుంచే శ్రీకారం చుట్టబోతున్నట్టు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెలరోజుల కిందట ప్రకటించారు. మూడు జిల్లాలకు అందుబాటులో ఉండేలా భీమిలి నియోజకవర్గంలోనే సభ ఏర్పాటు చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. దీంతో ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు, ముఖ్యంగా జిల్లా నేతలు సంబరపడ్డారు. మూడు జిల్లాల పరిధిలోని వైసీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులతోపాటు వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు గట్టిగా ప్రయత్నించి కనీసం మూడు లక్షల మందిని సభకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారీస్థాయిలో జనం హాజరవుతారనే ధీమాతో సభ జరిగే ప్రాంతం విశాలంగా, రవాణా సదుపాయం కలిగివుండాలని భీమిలి, ఆనందపురం మండలాల్లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. చివరకు సంగివలస సమీపంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న వైసీపీ నేత అక్కరమాని వెంకటరావు కుటుంబసభ్యులకు చెందిన 14 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలంలో సభా వేదిక, వీఐపీలకు గదులు, సీఎం వాహనం ... మిగతా 6వ పేజీలో

జేసీ విశ్వనాథన్ బదిలీ

- జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియామకం

కొత్త జేసీగా కేఎం అశోక్



కేఎస్ విశ్వనాథన్



కేఎం అశోక్

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు విశ్వనాథన్‌ను బదిలీ చేయగా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లోనే అడిషనల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా విశ్వనాథన్ స్థానంలో విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎం అశోక్‌ను నియమించింది.

ముక్కుసూటి తత్వమే కారణమా?

రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగానే జేసీ బదిలీ జరిగినట్టు చెబుతున్నా... దీని వెనుక కేఎస్ విశ్వనాథన్ ముక్కుసూటి తత్వమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2017 బ్యాచ్‌కు చెందిన ఈ ఐఏఎస్ అధికారి కేవలం ఏడాదిన్నర కిందటే విశాఖ జేసీగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒకేచోట మూడేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలి. కానీ రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే విశ్వనాథన్‌ను బదిలీ చేయడం, అదీ ప్రాధాన్యం లేని జీవీఎంసీ అదనపు కమిషనర్ పోస్టులో నియమిస్తూ నగరంలోనే పోస్టింగ్ ఇవ్వడంపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముక్కుసూటిగా, నిజాయితీగా పనిచేసే విశ్వనాథన్ ఎన్నికల సమయంలో వైసీపీ నేతలకు సహకరించే అవకాశం లేదనే భావనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాయింట్ కలెక్టర్‌గా ఆయన అనేక భూ వివాదాలకు సంబంధించిన ఫైళ్ల విషయంలో నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదని అధికారవర్గాల సమాచారం. దీనిపై అధికారపార్టీ నేతలు పలుమార్లు ఉన్నతాధికారులు, పార్టీ ముఖ్య నేతలకు ఫిర్యాదు చేశారని, ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించి, అంతగా ప్రాధాన్యం లేని పోస్టులోకి జేసీని బదిలీ చేసి ఉంటుందని కలెక్టరేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మహా బరితెగింపు

నగరంలో హోర్డింగ్‌ల ఏర్పాటుకు అడ్డగోలుగా అనుమతులు

- టెండరు ద్వారా కేటాయించాలన్న నిబంధన బేఖాతరు
- ఏడాది కిందట అస్మదీయులైన ఏజెన్సీలకు 70 హోర్డింగ్‌ల కేటాయింపు
- తాజాగా మరిన్ని హోర్డింగ్స్‌కు మరో ఏజెన్సీకి అనుమతి
- రూ.పది కోట్ల జీవీఎంసీ ఆదాయానికి గండి
- అధికారుల తీరుపై మిగిలిన యాడ్ ఏజెన్సీల అభ్యంతరం
- అయినా పట్టించుకోని అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

మహావిశాఖ నగర పాలకసంస్థ (జీవీఎంసీ) ఉన్నతాధికారులు అస్మదీయుల సేవలో పరితపిస్తున్నారు. తమను ప్రసన్నం చేసుకుంటే చాలు నిబంధనలను పక్కనపెట్టి మరీ మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులపై హోర్డింగ్స్‌ను నామినేషన్ పద్ధతిలో ఏడాది కిందట అస్మదీయులకు కట్టబెట్టిన అధికారులు, తాజాగా మరికొన్ని రహదారులపై హోర్డింగ్స్ ఏర్పాటుకు ఇదే పద్ధతిలో అనుమతులు ఇచ్చేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సిరిపురం పెట్రోల్ బంకు వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్



తెలుగుతల్లి ఫ్లైఓవర్ చివర ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్



రైల్వేస్టేషన్- న్యూకాలనీ రహదారిలో హోర్డింగ్‌కు ఏర్పాట్లు

జీవీఎంసీకి ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన వనరుల్లో ప్రకటనల విభాగం ఒకటి. టౌన్‌ప్లానింగ్‌లో అంతర్భాగంగా ఉండే ప్రకటన విభాగం ద్వారా జీవీఎంసీకి ఏటా రూ.25 కోట్లు ఆదాయం సమకూరుతుంది. దీనిలో అత్యధికంగా నగర పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఉండే కాంటీలీవర్ యూని పోల్ బోర్డులు (హోర్డింగ్‌లు), రోడ్డు మధ్యన డివైడర్, సెంటర్ మీడియన్‌లపైన ఉండే లాలీపాప్ యాడ్ బోర్డుల ద్వారా లభిస్తుంది. హోర్డింగ్‌లు, లాలీపాప్ యాడ్ బోర్డులను దక్కించుకునేందుకు నగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలతోపాటు ప్రైవేటు యాడ్ ఏజెన్సీలు పోటీ పడుతుంటాయి. ఒకటి, రెండు రోడ్లను ఒక స్ట్రెచ్‌గా విభజిస్తూ జీవీఎంసీ ప్రతి ఏటా లేదా రెండుమూడేళ్లకు ఒకసారి వీటిని టెండర్ ద్వారా కేటాయిస్తుంది.

నిబంధనలను కాదని...

నిబంధనల ప్రకారం టెండరు పిలిచేముందు టౌన్ ప్లానింగ్ అధికారులు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలుస్తారు. ఆర్ఎఫ్‌పీలో యాడ్ ఏజెన్సీలు కోట్ చేసిన ధరల్లో అత్యధికంగా చెల్లించేందుకు సిద్ధపడిన వారి అంచనాలను బట్టి జీవీఎంసీ అధికారులు టెండర్ పిలుస్తారు. ఆసక్తి ఉన్న సంస్థలు, వ్యాపారులతోపాటు యాడ్ ఏజెన్సీలు టెండరులో పాల్గొంటాయి. ఎవరు ఎక్కువ మొత్తం చెల్లించేందుకు ముందుకు వస్తే వారికి టెండర్ కేటాయిస్తుంది. టెండర్ దక్కించుకున్నవారు స్వయంగా ఆయా ప్రాంతాల్లో ప్రకటనలు పెట్టుకోవడం లేదా ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

- విద్యుత్తు కొనుగోళ్లు, చార్జీల పెంపుపై విశాఖ వేదికగా విచారణ
- వర్చువల్ విధానంలో అభిప్రాయాలు తెలపనున్న 71 మంది
- నాలుగు రోజులపాటు కార్యక్రమం

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత చార్జీల పెంపు, విద్యుత్ కొనుగోళ్లపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్‌సీ అధికారులతోపాటు ఏపీ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) విధానంలో స్వీకరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై ఎనిమిది మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం ఎనిమిది మంది అభిప్రాయాలను తెలియజేయనున్నారు. ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోని వారు కూడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలనుకుంటే సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీ ఈఆర్‌సీ అనుమతితో రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.



ప్రజాభిప్రాయ సేకరణకు ఈపీడీసీఎల్ కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు

నగరంలో లావణ్య సందడి



సినీ నటి లావణ్య త్రిపాఠి ఆర్‌కే బీచ్‌లో ఆదివారం సందడి చేశారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైజాగ్ వాలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీచ్ క్లీనింగ్‌లో ఆమె పాల్గొన్నారు. అందమైన నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచాలన్నారు. - 8లో

24 గంటల్లో డోర్ డెలివరీ

పార్శిల్ రవాణాపై ఆర్టీసీ కార్యాచరణ

- ప్రస్తుతానికి 84 నగరాలకు పరిమితం
- త్వరలో సెమీ అర్బన్ ప్రాంతాల్లో విస్తరణకు ఏర్పాట్లు
- లాజిస్టిక్స్ ద్వారా ఆదాయం పెంపునకు అధికారుల యత్నాలు

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 28: లాజిస్టిక్స్ సేవల ద్వారా మరింత ఆదాయం సమకూర్చుకోవాలని ఆర్టీసీ (పీటీడీ) అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఎక్కడికైనా 24 గంటల వ్యవధిలోనే పార్శిల్స్‌ను డోర్ డెలివరీ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. పార్శిల్ బుక్ చేసినప్పటి నుంచి మరుసటిరోజు అదే సమయంలోగా గమ్యస్థానానికి చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విధానాన్ని ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో అమల్లోకి తేనున్నారు. లాజిస్టిక్స్ సేవలు ప్రారంభించిన తరువాత 2021 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ప్రధాన నగరాల్లో డోర్ డెలివరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. లాజిస్టిక్స్ ప్రధాన కార్యాలయం, ఆథరైజ్డ్ ఏజెన్సీకి పది కిలోమీటర్ల పరిధిలోని వారికి నేరుగా పార్శిల్స్ అందిస్తున్నారు. తొలుత ప్రధాన నగరాలకు పరిమితం చేసిన ఈ సేవలను దశల వారీగా 84 పట్టణాలకు విస్తరించారు. వచ్చే నెల నుంచి మరో 40 సెమీ అర్బన్ ప్రాంతాల్లో ... మిగతా 6వ పేజీలో



ద్వారకాబస్‌స్టేషన్‌లోని పార్శిల్ బుకింగ్ కేంద్రం

పార్శిల్ డోర్ డెలివరీ చార్జీలు

బరువు	చార్జీ రూ.లలో
కిలో వరకు	18
కిలో నుంచి 6 కిలోల వరకు	30
6 నుంచి 10 కిలోల వరకు	36
10 నుంచి 25 కిలోల వరకు	48
25 నుంచి 50 కిలోల వరకు	59



లాజిస్టిక్స్ వెహికల్

'గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి'

అక్కయ్యపాలెం, జనవరి 28: గ్రూప్-2 కొత్త సిలబస్‌కు సంబంధించి ప్రభుత్వ ప్రామాణికమైన పుస్తకాలు లేకపోవడంతో ఈ ఉద్యోగాల భర్తీ వాయిదా వేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, టెట్ నోటిఫికేషన్‌తోపాటు డీస్సీ విడుదల చేయాలని లేదా, టెట్ టీ ఆర్టీ ఇవ్వాలన్నారు. డిగ్రీ కాలేజ్ లెక్చరర్ ఉద్యోగానికి పరీక్ష రాయాలంటే ఏపీ సెట్ క్వాలిఫై అయి ఉండాలని, అందుకోసం మరోసారి ఏపీ సెట్ నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని ఇప్పటి వరకునిలుపుకోలేదన్నారు. దీంతో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుతం తాజాగా మరో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం చేశారని, టెట్ నోటిఫికేషన్‌తోపాటు డీఎస్సీ నోటిఫికేషన్‌ను అభ్యర్థులు కోరుకుంటున్నారన్నారు. టెట్ ఫలితాలు వస్తే గానీ డీఎస్సీ పెట్టలేని పరిస్థితి ఉందని, 2022లో టెట్ నిర్వహించి ఇంతవరకు డీఎస్సీ పెట్టలేదని పేర్కొన్నారు. టెట్‌తో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష తేదీలు ఖరారు చేయాలన్నారు.

వాకర్స్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలకు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్, జనవరి 28 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్య నిపుణులు ఎం.రామరాజు పాల్గొని గుండె సంబంధిత, కీళ్ల సమస్యలపై రోగులకు చికిత్సలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఆహార నియమాలు పాటిస్తూ, నిత్యం వ్యాయామం చేయాలని రోగులకు సూచించారు. షుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవాలని కోరారు. వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎన్‌వైకేఎస్ సభ్యునిగా 'కొండా'


కొండా ప్రసాద్

అక్కయ్యపాలెం, జనవరి 28 : నెహ్రూ యువ కేంద్ర అడ్వయిజరీ బోర్డు (ఎన్‌వైకేఎస్) సభ్యునిగా యువమోర్చా రాష్ట్ర అధి కార ప్రతినిధిగా కొండ ప్రసాద్‌ను నియమిస్తూ యూత్ అఫైర్, స్పోర్ట్స్ కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి అడ్వయిజరీ బోర్డు సభ్యునిగా నియమించేందుకు కృషి చేసిన యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణకు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకు, జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథరాజుకు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సేవా రత్న పురస్కారాల ప్రదానం

అక్కయ్యపాలెం, జనవరి 28: రెండు దశాబ్దాలకు పైగా ఎంతో మందికి రక్తం అందించి తాసుబెల్లి ఫౌండేషన్ ప్రాణదాతలుగా నిలిచిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ కొనియాడారు. ఆదివారం నరసింహనగర్‌లోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వివిధ రాష్ట్రాల్లో రక్తదానంతోపాటు వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న 150 మందికి భారత సేవా రత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, టీడీపీ నాయకులు ఆడారి కిశోర్‌కుమార్, సంస్థ ట్రస్టీలు ఎర్రంశెట్టి సురేశ్, ఎస్.వెంకటలక్ష్మి, అఖిల్‌నాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పరిహార చెక్కు పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 28: అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణలో భాగంగా తాజ్‌బాబా మసీదుకు సంబంధించిన ఆస్తులు కొంతమేర నష్టం జరగడంతో వాటి నిర్మాణ విలువ ప్రకారం రూ.9.12 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం నుంచి మంజూరైనట్టు ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. ఈ మేరకు ఆయన సంబంధిత మసీదు పెద్దలకు ఆ చెక్కును ఆదివారం అందజేశారు. అలాగే రోడ్డు విస్తరణలో నష్టపోయిన స్థలానికి త్వరలో టీడీఆర్ మంజూరు చేస్తామని, దాని ద్వారా మసీదు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, వైసీసీ 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు బర్కత్ ఆలీ, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం జిల్లా బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పరుశురామ్‌రాజు


పరుశురామ్‌రాజు

సీతమ్మధార, జనవరి 28: భారతీయ జనతా పార్టీకి చెందిన పరశురామ్ రాజ్‌కు ఆ పార్టీ అధిష్టానం పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, పార్వతీపురం, సాలూరు, బొబ్బి లి, అరకు తదితర నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. తనను నియమించిన నేతలకు కృతజ్ఞతలను తెలిపారు. పరుశురాం అరకు జిల్లా ఇన్‌చార్జిగానూ సేవలందిస్తున్నారు.

మొక్కు తీరకుండానే మృత్యుఒడికి..

» వ్యాన్ తొట్టి ఢీకొని యువకుడి మృతి

రాజమహేంద్రవరం,జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుడికి మొక్కు తీర్చుకుందామని వెళ్లిన ఆనందం ఆ కుటుంబంలో గంటల్లో ఆవిరై పోయింది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ పట్నం జిల్లా కొత్తగాజువాకకు చెందిన గొర్ల నాయుడు(26) స్థానికంగా ఏవీ అప్పారావు రోడ్‌లో నివాసం ఉండే అక్కాబావ దగ్గర ఉంటున్నాడు. తన బావ అప్పలనాయుడు సూపర్‌వైజర్‌గా పనిచేసే రెస్టారెంట్లో ఉద్యోగం చేస్తున్నాడు. మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కేశవరంలోని గుడికి వెళ్లాడు. ఏవో సరుకులు అవసరం కావడంతో రాజమహేంద్రవరం వచ్చి తీసుకెళుతున్నాడు. రాజవోలు రోడ్డులో వెళుతుండగా పక్కనే వెళ్తున్న పౌరసరఫరాల బియ్యం రవాణా చేసే వ్యాన్ తొట్టి వెనుక భాగం అతడి తలకు బలంగా తగిలింది. దీంతో నాయుడు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జుబేర్ తెలిపారు.


ఇంటిగ్రేటెడ్ శిక్షణలో గండి బాబ్జీ, నాయకులు


మాట్లాడుతున్న 24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు పద్మలత

'సిద్ధం' సభలో ఉత్తరాంధ్ర ఊసెత్తని జగన్

» టీడీపీ సౌత్ జోన్ ఇన్‌చార్జి గండి బాబ్జీ ధ్వజం

మహారాణిపేట, జనవరి 28: భీమిలి నియోజవర్గ పరిధిలోని సంగివలస వద్ద నిర్వహించిన సిద్ధం సభలో జగన్ ఉత్తరాంధ్ర ఊసెత్తకుండా ప్రసంగాన్ని పూర్తి చేయడం ఆయనకు ఈ ప్రాంతంపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధం సభకు మూడు లక్షల మంది కాదని 30 వేల మంది మాత్రమే వచ్చారని ఎద్దేవా చేశారు. ఆయన ప్రకటించిన హామీలు ఎక్కడ అమలు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. జగన్ మద్య నిషేధం అమలు చేసి ఎన్నికలకు వెళ్తానని మాట ఇచ్చి మడమ తిప్పారన్నారు. విశాఖ రాజధాని కోసం సభలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎస్ఈజెడ్‌లో టీడీపీ హయాంలో మంజూరు చేసిన కంపెనీలను తమ గొప్పగా ప్రకటించారన్నారు. దేవుని దయ అంటూ ఆ దేవుని చెందిన సీబీఎస్‌సీ స్థలాలను దోచుకుని వాటాలుగా పంచుకున్నరని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను గాలికి వదిలేశారని, రైతులకు విద్యుత్ బిల్లులను మరితంగా భారంగా మార్చారన్నారు. డిస్కమ్‌లకు రూ.80 వేల కోట్లు బకాయిలున్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి వైఖరిని ప్రజలు గుర్తించారని అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో ఇండిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంను ఆదివారం రామకృష్ణ మిషనరీ స్కూల్ వద్ద గండి బాబ్జీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయం కావాలి

సీతమ్మధార: రానున్న ఎన్నికల్లో టీడీపీ అమలుచేయనున్న సం క్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చే యాలని గ్రేటర్ 24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత కోరారు. వార్డులో 'ఉత్తర' ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు ఆదేశాలపై 24, 25, 14వ వార్డుల్లోని పార్టీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అరాచకసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ తీ రును ప్రజలకు వివరించాలన్నారు. క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు శిక్షణలో పాల్గొన్నారు. సెంట్రల్ పార్టీ నుంచి జేపీ రాజు, కె. కిశోర్, ఐటీపీ విశాఖ పార్లమెంట్ కోటా నరేశ్, 14వ వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు, 25వ వార్డు అధ్య క్షుడు నమ్మి రవికుమార్, మాజీ కార్పొరేటర్ ఇసరప వెంకటలక్ష్మి, కోట్టాన దేముడుబాబు, వంగలపూడి నూకరాజు పాల్గొన్నారు.

గ్రేటర్ 26వ వార్డులో ఇంటి గ్రేటెడ్ శిక్షణ

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు చిన్నూరులోని టీడీపీ కార్యాలయంలో కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు. త్వరలో జరగనున్న సార్వత్రి ఎన్నికల సందర్భంగా ఓటర్ల వెరిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. త్వరలో పార్టీ అమలు చేయనున్న సూపర్ సిక్స్‌లో భాగంగా పథకాలను పార్టీ నియమించిన బృందం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ముక్కా కిశోర్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జి నరసింహారావు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ జరిగింది. వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిని సందర్శించిన రష్యన్లు


శ్రీవారి పూజల్లో రష్యన్లు

పెందుర్తి, జనవరి 28: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం పలువురు రష్యన్లు సందర్శించారు. ఆలయ ప్రాంగణంలోని దేవతామూర్తులను, గర్భాల యంలోని శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. వెంకటాద్రి శిఖరం ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. ఆలక శిల్పకళా సౌందర్యాన్నికి ముగ్ధులయ్యారు. అనంతరం ఆలయ సన్నిధిలో వారు పురుషసూక్త పారాయణాన్ని పఠించారు.

పంచగ్రామాల సమస్య పరిష్కరించాలి



వేపగుంటలో ర్యాలీ చేస్తున్న యువకులు, గ్రామపెద్దలు

వేపగుంట జనవరి 28: వేపగుంట పరిసర ప్రాంతాల్లో దీర్ఘ కాలంగా ఉన్న దేవస్థాన, ఉడా భూముల సమస్య ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీలకతీతంగా స్థానిక యువకులు, గ్రామపెద్దలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. తొలుత వేపగుంట ముత్యాలమ్మ గుడి నుంచి ప్రారంభమమైె ర్యాలీ వేపగుంట కూడలికి చేరింది. అక్కడ కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని కృష్ణరాయపురం వరకు కొనసాగించారు. 1903 గిల్‌మెన్ సర్వే ప్రకారం దేవస్థాన సమస్యను పరిష్కరించాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈసమస్య ఉన్నా పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. ఈస్థితిలో అన్ని పార్టీల నాయకులు ఈ విషయంలో సహకరించాలని కోరారు. ఈ ర్యాలీలో వార్డు కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, గ్రామపెద్దలు ముత్తానాయుడు, గంట్ల దేముడు, శేశెట్టి అప్పారావు, పిన్నింటి సత్యవతి, సాలాపు రమణ, తామడ నరసింగరావు, పెద్ద ఎత్తున యువత, రైతు సంక్షేమ సంఘ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాక్సింగ్ కౌన్సిల్ నూతన కమిటీ నియామకం


కమిటీకి నియామక పత్రాలందిస్తున్న మణింధర్ సింగ్

దొండపర్తి, జనవరి 28 : ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ నూతన కమిటీ నియామకమైంది. అధ్యక్షునిగా యల్లపు రఘురామ్, జనరల్ సెక్రటరీగా వాసుపల్లి అమ్మోరుతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ మేరకు వీరికి ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు మురదరణ్ రాజా ఆదేశాలమేరకు తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ మణింధర్ సింగ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీకి ప్రొఫెషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ జరుపుకునేందుకు లైసెన్స్ జారీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇప్పటికే రెండు ప్రొఫెషనల్ బాక్సింగ్ బౌంట్స్‌లో పాల్గొని ర్యాంకింగ్ సాధించిన బాక్సర్లు కె.శ్రీను, భవానీ ప్రసాద్, గణేశ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గొర్లె చందు, డాక్టర్ బి.సునీల్, యల్లపు పృథ్వీ, వాడాడ రుబెన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఐఐఈ 67వ వార్షికోత్సవం


ఐఐఐఈ నూతన కార్యవర్గ సభ్యులు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఐఐఈ) వైజాగ్ చాప్టర్ 67వ వార్షికోత్సవాన్ని ఆదివారం నగరంలోని ఓ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ కౌన్సిల్ కార్యదర్శి ఏవీవీ ప్రసాద్‌రాజుమాట్లాడుతూ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ పాత్రపై కీలకపోన్యాసం చేశారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అంశాల గురించి వివరించారు. అనంతరం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కౌన్సిల్ చైర్మన్‌గా జి.గాంధీ, వైస్ చైర్మన్‌గా ఎన్ వీఎస్ రాజు, కార్యదర్శిగా రామకృష్ణ దువ్వు, కోశాధికారిగా కేవీఎల్ఎన్ రాజు, సం యుక్త కార్యదర్శిగా ఎన్.సుందరం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో చాప్టర్ చైర్మ న్ వి.నారాయణ్, స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) జి.గాంధీ పాల్గొన్నారు.

ఎక్కడ విఫలమయ్యాం?


... 5వ పేజీ తరువాయి

వేదిక వద్దకు వచ్చిపోయేందుకు వీలుగా రోడ్డు, సభకు హాజరయ్యే జనాల మధ్యకు ముఖ్యమంత్రి వెళ్లి మాట్లాడేందుకు వీలుగా ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక వంటి వాటి కోసం నాలుగు ఎకరాలు పోగా మిగిలిన పది ఎకరాలను జనాల కోసం సిద్ధం చేశారు. పది ఎకరాల్లో గరిష్ఠంగా 40 వేలు మంది మాత్రమే కుర్చీల్లో కూర్చొనేందుకు వీలుంటుందని భావించి, ముందుబాగంలో కుర్చీలు వేసి, వెనుక ఉన్న ప్రదేశాన్ని అలానే వదిలేశారు.

టార్గెట్ మరిచి ఏర్పాట్లు: మూడు లక్షల మందిని సభకు తరలించనున్నట్టు ప్రకటించిన వైసీపీ నేతలు సభకోసం ఎంపిక చేసిన స్థలంలో కేవలం 40 వేలు మంది మాత్రమే కుర్చునేందుకు వీలుంటుందనే విషయం తెలిసినప్పటికీ గుంభనంగా ఉండిపోయారు. తీరా సభ ప్రారంభయ్యే సరికి హాజరైనవారిలో కొందరు బయటకు వెళ్లిపోవడంతో వెనుకవైపు కుర్చీలు, ఇతర గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. సీఎం మాట్లాడుతుండగానే వేదికకు ఎదురుగా వెనుకవైపు ఖాళీగా ఉన్నకుర్చీలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్‌మీడియాలో ట్రోల్ అయిపోవడంతో వైసీపీ నేతలు డీలాపడిపోయారు. సభకు కనీసం మూడు లక్షల మందిని తరలిస్తామని గొప్పగా ప్రకటనలు చేసినవారంతా అధిష్ఠానానికి దీనిపై ఎలా వివరణ ఇచ్చుకోవాలో తెలియక తలలు పట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం కొందరు వైసీపీ నేతలు సభ జరిగిన తీరుతోపాటు, ఫీడ్‌బ్యాక్‌పై ఒకరినొకరు అడిగి తెలుసుకుంటూ అంతరంగికంగా సమీక్ష నిర్వహించుకున్నట్టు ఆపార్టీనేత ఒకరు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

నియోజకవర్గం నుంచి ఐదు వేల మందిని తేలేకపోయాం

ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాలు జిల్లా పరిధిలోనే ఉన్నందున ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం ఐదు వేల మందిని తరలించ గలిగినా సభా ప్రాంగణం నిండిపోయేదని నేతలు అభిప్రాయపడినట్టు చెబుతున్నారు. సభా ప్రాంగణంలో 30 వేల నుంచి 40 వేల మంది ఉంటే కిక్కిరిసిపోయి జనాలురోడ్లపైకి వచ్చేసేవారని అభిప్రాయపడినట్టు తెలిసింది. దీనిప్రకారం చూసుకున్నా భీమిలి నియోజకవర్గం నుంచి పదివేలు, మిగిలిన ఆరు నియోజకవర్గాల నుంచి కనీసం ఐదు వేల మందిని తరలిస్తే సభ హిట్ అయ్యేదని నగరంలోని ఓ ముఖ్యనేత అభిప్రాయపడినట్టు సమాచారం. నగర పరిధిలోని కొన్ని ప్రాంతాలకు కేటాయించిన బస్సుల్లో కనీసం ఐదు, పది మంది కూడా లేకుండానే సభాప్రాంగణానికి చేరుకున్నాయని నామినేటెడ్ పోస్టులో ఉన్న ఒక నేత చెప్పినట్టు సమాచారం. నగర పరిధిలోని మరికొన్ని ప్రాంతాలకు కేటాయించిన బస్సులను ఆయా వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు జనాలతో నింపడంపై దృష్టిపెట్టకుండా ముందుగానే సభాప్రాంగణానికి వెళ్లిపోవడం కూడా వైఫల్యానికి కారణమని జీవీఎంసీ పాలకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న నేత ఒకరు ముఖ్యనేతల వద్ద కుండబద్దలు కొట్టినట్టు చెప్పారని ప్రచారం జరుగుతోంది. భవిష్యత్తులోనైనా పార్టీ సభలు, సమావేశాలకు జనాల తరలింపుపై పూర్తిస్థాయిలో దృష్టిసారించకుండా, ఇప్పటిలాగే మహిళా సంఘాల సభ్యులు వస్తారనే ధీమాతో ఉంటే ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని నేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. లోపాలను అధిగమించుకోని పక్షంలో పార్టీ అధిష్ఠానం నుంచి అక్షింతలు వేయించుకోవడానికి సిద్ధంగా ఉండాలని ముఖ్యనేత ఒకరు తనవద్ద సభ గురించి ప్రస్తావించిన వారిని హెచ్చరించినట్టు తెలిసింది.


వేరే బూత్‌లో శివ దేవదులత అనే వ్యక్తి ఓటు



తొలగించిన 218 కేంద్రంలోని ఓ వ్యక్తి ఓటు


సీరపువీధిలో డబుల్ ఎంట్రీలో ఆరుగురి ఓట్లు

డబుల్ ఎంట్రీలు.. ఉన్నది ఒకచోట.. ఓటు మరోచోట

» 27వ వార్డు పరిధి ఓటరు జాబితాల్లో చిత్రవిచిత్రాలు

» ఓట్లు గల్లంతు పై స్థానికుల ఆగ్రహం

'ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. ఓటుతో తలరాత మార్చుకో.. సచ్ఛీలురైన నేతలను ఎన్నికల్లో గెలిపించుకోవడంలో ఓటే కీలకం.. ఓటరూ మేలుకో.. మీకున్న హక్కును సద్వినియోగం చేసుకుని మంచి సమాజ నిర్మాణానికి దోహదపడండి' ఇవన్నీ వీలున్నచోటల్లా అధికారులు నిత్యపారాయణంలా పఠిస్తుంటారు.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి తప్పులుతడకల జాబితాలతో జనాలను గందరగోళంలోకి నెడుతున్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితో ఇష్టారీతిగా ఓట్ల తొలగింపుపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈస్థితిలో గ్రేటర్ విశాఖ 27వ వార్డులో వెలుగుచూసిన కొన్నిలోపాలు ఇవి..

దొండపర్తి, జనవరి 28: గ్రేటర్ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఓట్లు గల్లంతయ్యాయి. ఓటర్ల జాబితాల్లో కొంతమంది పేర్లు లేకపోవడంతో వారంతా అవాక్కవుతున్నారు. మరికొంతమందికి చెందిన ఓట్లు వేరే పోలింగ్ బూత్‌ల్లో చేర్చారు. ఇటీవల వరకు తమ ఓట్లు తామున్నటున్న పరిసర పోలింగ్ బూత్‌ల పరిధిలోనే ఉండేవని, కానీ ప్రస్తుతం వేరేచోట్లకు మార్పు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొన్నిచోట్ల కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో కాకుండా వేర్వేరు చోట్ల ఉండడంపై మండిపడుతున్నారు. వార్డు పరిధిలోని 218 పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన 48-5-39/1 డోర్ నంబరుకు చెందిన పిల్లి శ్రీనివాసరెడ్డి (23) ఓటు 216 పోలింగ్ బూత్‌లో నమోదైంది. ఆయన కుటుంబ సభ్యుల ఓట్లన్నీ 218 పోలింగ్ బూత్‌లోనే కొనసాగుతున్నాయి. అలాగే, 218 పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన 48-6-13 నంబరుకు చెందిన దేవదులత శివ (36) ఓటు ఏకంగా తొలగించారు. కానీ, ఆయన మాత్రం అదే డోర్ నంబరులో నివశిస్తున్నారు. ఆ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్వో ఒక్కరోజు కూడా ఓటర్ల జాబితా తనిఖీ చేయలేదని ఆరోపిస్తున్నారు. ఆమె సెలవుపై వెళ్లిపోవడంతో మరొకరిని ఆ స్థానంలో భర్తీ చేయకుండానే ఎలా నిర్ధారించారో ఎవరికి అర్థం కావడంలేదని పలువురు వాపోతున్నారు.

దొండపర్తి సీరపువీధిలో ఉన్న 224 పోలింగ్‌బూత్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి ఓట్లను మళ్లీ జాబితాలో చేర్చారు. ఇలాకొనసాగితే అర్హులెవరూ రానున్న ఎన్ని కల్లో ఓట్లు వినియోగించుకోనే పరిస్థితి ఉండదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల గల్లంతుపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో బెంబేలెత్తించిన యువకులు

» అడ్డుకున్న కానిస్టేబుల్‌పై దాడికి యత్నం


కృష్ణానగర్ వద్ద కానిస్టేబుల్‌పై దాడికి యత్నిస్తున్న యువకులు

వేపగుంట జనవరి 28: నాయుడుతోట కృష్ణానగర్ బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆదివారం కొందరు యువకులు కార్ల ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రయాణికులను భయభ్రాం తికిలోనుచేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలివి.. యువకులు కార్లల్లో మురళీనగర్ నుంచి పెందుర్తివైపు వెళుతున్నారు. వీరు ఎన్ఏడీ నుంచి పరిమితికిమించి వేగంతోపాటు జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేస్తూ ముందుకు సాగారు. వీరి వాహనాలను చూసి జనాలు ఆందోళన చెందారు. ఈ క్రమంలో నాయుడుతోట వైపు వస్తున్న కానిస్టేబుల్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టే ప్రయత్నంచేశారు. దీంతో ఆ కానిస్టేబుల్ వాహనాన్ని నిలిపి వారిని ప్రశ్నించారు. లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలు చూపాలనికోరారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న యువకులంతా ఒక్కసారిగా కానిస్టేబుల్‌పై బెదిరింపులకు దిగారు. వెనుక వస్తున్న కార్లలో ఉన్న యువకులతో కలిసి కానిస్టేబుల్‌పై దాడికి ప్రయత్నించారు. దీంతో కొందరు స్థానిక యువకులు వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో ఓ యువకుడు కానిస్టేబుల్ వాహనం కీ పట్టుకుపోయాడు. దీంతో వెంటనే కానిస్టేబుల్ పెందుర్తి పోలీసులకు, ట్రాఫిక్ పోలీసులకు అలెర్ట్ చేసి ఎరుపు రంగులో వెళ్తున్న కారును అడ్డుకోవాలని మెసేజ్ పెట్టారు. ఆ కారును ఎట్టకేలకు సుజాతానగర్ కూడలిలో పట్టుకున్నారు. అందులో ప్రయాణిస్తున్న యువకులను పెందుర్తి ఎస్ఐ రమేష్ వద్దకు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. కానిస్టేబుల్‌కు క్షమాపణలుచెప్పించారు. యువకుల భవిష్యత్తుకు ఇబ్బంది కలుగుతుందని వారిని వారందరిని హెచ్చరించి పంపేశారు.

'మహా' బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

ఇతరులకు సబ్‌లీజ్‌కు ఇవ్వడం చేసుకోవచ్చు. దీనిప్రకారం ప్రస్తుతం బీచ్‌రోడ్డులో హోర్డింగ్స్, లాలీపాప్ యాడ్స్‌తోపాటు, మరో రెండు ప్రధాన రోడ్లపై లాలీపాప్ యాడ్స్‌కు ఏడాది కిందట టెండర్ గడువు ముగిసింది. తర్వాత వాటిని ఆర్ఎఫ్‌పీ పిలిచి, టెండర్ ఆహ్వానించాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులు కొన్ని లాలీపాప్ యాడ్‌బోర్డులకు మాత్రమే టెండర్ పిలిచి, మిగిలిన వాటితో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై సుమారు 70 వరకూ కాంటిలీవర్ హోర్డింగ్‌లను నామినేషన్ పద్ధతిలో కేటాయించేయడం అప్పట్లో వివాదాస్పదమైంది. నగరంలోని మిగిలిన యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు జీవీఎంసీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ చీఫ్ సిటీప్లానర్‌ను కలిసి అభ్యంతరం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా అప్పగిస్తారంటూ నిలదీయడంతో వారికి తలాకొన్ని బోర్డులు ఇస్తామంటూ బుజ్జగించారు. తాజాగా మరో యాడ్ ఏజెన్సీకి నగరంలోని పలురహదారులపై కాంటిలీవర్ యూనిపోల్ హోర్డింగ్‌ల ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు నామినేషన్ పద్ధతిలో అనుమతించారంటూ నగరంలోని యాడ్ ఏజెన్సీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కచ్చితంగా టెండర్ పిలిచిన తర్వాత ఎవరు ఎక్కువకు కోట్‌చేస్తే వారికి కేటాయించాల్సిన హోర్డింగ్‌లను ఏకపక్షంగా ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు అడిగినా జీవీఎంసీ అధికారులు దాచిపెడుతున్నారని, సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా ప్రయోజనం కనిపించడం లేదని వాపోతున్నారు.

రూ. పది కోట్ల ఆదాయానికి గండి:

నగరంలోని ప్రధాన రోడ్లపై హోర్డింగ్‌లు, లాలీపాప్ యాడ్ బోర్డుల ఏర్పాటుకు టెండరు పిలిస్తే జీవీఎంసీకి సుమారు రూ.పది కోట్లు ఆదాయం సమకూరేదని యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. టెండర్ ప్రస్తావన లేకుండా అస్మదీయులైన యాడ్ ఏజెన్సీకి కట్టబెట్టేస్తుండడంతో ఆదాయం కోల్పోయినట్టేనన్నారు. మరోవైపు జీవీఎంసీ అధికారులు కూడా సంస్థకు ఆదాయం పెంచేందుకు తామంతా కష్టపడి పనిచేస్తుంటే... ఉన్నతాధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అమలుకు సహకరించాలనిఒత్తిడిచేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు.

భవిష్యత్తులో ప్రమాదాలకు ఆస్కారం

రోడ్డు మధ్యన ఉండే సెంటర్ మీడియన్లపై ఏర్పాటుచేసే కాంటిలీవర్ యూనిపోల్ హోర్డింగ్‌లు భవిష్యత్తులో ప్రమదాలకు కారణమవుతాయని పోలీస్ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో హోర్డింగ్ ఎత్తు సుమారు 34 అడుగులు ఉంటుందని, పోల్‌పైన హోర్డింగ్ ఎత్తు 12 అడుగులు, వెడల్పు 30 అడుగులు ఉంటుందని, భవిష్యత్తులో తుపాన్లు, పెనుగాలులు సంభవించే సమయంలో హోర్డింగ్‌లు ఎగిరిపడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా అలాంటి బోర్డులు ఏర్పాటుచేసేచోట రోడ్డు వెడల్పు కనీసం వంద అడుగులుండాలని, అప్పుడే రోడ్డుపై వెళ్లే వాహనచోదకులకు దూరంగా ఉండే వాహనాల రాకపోకలు, రోడ్డు పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు. కానీ నగరంలో ఎక్కడా కనీసం కిలోమీటరు పొడవున తిన్నగా ఉన్నరోడ్డుగాని, వంద అడుగులు వెడల్పు ఉన్న రోడ్డుగానీ లేనప్పటికీ సుమారు 90 ప్రాంతాల్లో కాంటిలీవర్ యూనిపోల్ హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం సరికాదంటున్నారు. వీటన్నింటినీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోకుండా అస్మదీయుల సేవలో తరిస్తూ జీవీఎంసీ ప్రయోజనాలు, నగరవాసుల భద్రతను గాలికి వదిలేయడం దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

24 గంటల్లో డోర్ డెలివరీ

... 5వ పేజీ తరువాయి

అందుబాటులోకి తేనున్నారు.


ప్రస్తుతం 50 కిలోలకు పరిమితం: ప్రస్తుతం 50 కిలోల వరకు బరువున్న పార్శిల్స్‌నుమాత్రమే పీటీడీ డోర్ డెలివరీ చేస్తు న్నది. వచ్చే ఏడాది జనవరి నుంచి దీనిని వంద కిలోల వరకు పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలు సమకూర్చుకుంటోంది.

డోర్ డెలివరీ చేస్తున్న పట్టణాలు

రాష్ట్రంలో కర్నూలు, అదోని, ఆళ్ళగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు, అనంతపురం, ధర్మవరం, గుత్తి, గుంతకల్, హిందూపురం, కదిరి, రాయదుర్గం, తాడిపత్రి, కడప, బద్వేల్, బమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, రాయచోటి, చిత్తూరు, మదనపల్లి, పుత్తూరు, తిరుపతి, కుప్పం, పలమనేరు, పీలేరు, శ్రీకాళహస్తి, ఒంగోలు, కందుకూరు, మార్కాపురం, అద్దంకి, గిద్దలూరు, కనిగిరి, పొదిలి, నెల్లూరు, కావలి, వెంకటగిరి, గుంటూరు, నరసారావుపేట, పిడుగురాళ్ల, పొన్నూరు, రేపల్లె, తెనాలి, వినుకొండ, బాపట్ల, చిలకలూరిపేట, విజయవాడ, అవనిగడ్డ, గుడివాడ, జగ్గయ్యపేట, మచిలీపట్నం, నూజివీడు, ఏలూరు, భీమవరం, జంగారెడ్డి, గూడెం, కొవ్వూరు, పాలకొల్లు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు, తుని, అన్నవరం, సామర్లకోట, విశాఖపట్నం, అనకాపల్లి, గాజువాక, నర్సీపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పాలకొండ, పలాస, సాలూరు, నరసన్నపేట లాజిస్టిక్స్ కేంద్రాల నుంచి పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తున్నారు.

పెరుగుతున్న ఆదాయం: గత ఆర్థిక సంవత్సరంలో రూ.77.01 కోట్లు ఆదాయం రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.77.69 కోట్లు ఆదాయం వచ్చింది. 11 శాతం పెరిగినట్టు లెక్కలు తేల్చారు. డోర్ డెలివరీ విధానంతోనే ఆదాయంలో పెరుగుదల వచ్చిందని అభిప్రాయపడుతున్నారు.

హౌస్ షిఫ్టింగ్ చేస్తాం



విశాఖ నుంచి ఇతర ప్రాంతాలు, ఇతర ప్రాంతాల నుంచి విశాఖకు ఇల్లు మారాలనుకునేవారి గృహోపకరణాలు, ఫర్నిచర్ తదితర సామగ్రిని రవాణా చేస్తాం. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా, అలాగే ఏప్రాంతం నుంచి అయినా ఉత్తరాంధ్ర జిల్లాలకు షిఫ్టింగ్ చేస్తాం. ఒకరోజు ముందుగా తెలియజేస్తే తరలించాల్సిన సామగ్రిని భద్రంగా ప్యాకింగ్ చేయిస్తాం. ప్యాకేజీ, తరలించడానికి అయ్యే రుసుమును వారికి తెలియజేస్తాం. సామగ్రి బరువును అంచనా వేసి రుసుము నిర్ణయిస్తాం.

- బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్), విజయనగరం జోన్

అవకాశాలను వినియోగించుకుంటున్నాం



లాజిస్టిక్స్ విభాగం నుంచి అధిక ఆదాయం పొందేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నాం. పార్శిల్స్ రవాణా, డోర్ డెలివరీ, హౌస్ షిఫ్టింగ్, కార్గో రవాణా సౌకర్యాలు అందిస్తాం. ప్రైవేటు రవాణా సంస్థల కంటే తక్కువ చార్జీతో నాణ్యమైన సేవలందిస్తాం. లాజిస్టిక్స్ ఆదాయంలో విజయనగరం జోన్ మంచి స్థానంలో ఉంది.

-సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయనగరం జోన్



రక్తదాన శిబిరంలో కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జనవరి 28: రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణదాతలు కావాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదని, ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయాలని కోరారు. ఇటువంటి శిబిరాలను మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, ఎల్.సోంబాబు, నాగేశ్వరరావు, వినోద్‌బాలు, జాగరపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ వేపచెట్టు జంక్షన్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. 116 మందికి నేత్ర పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ ఎం.జగన్నాథం మాట్లాడుతూ గ్రామాల్లో విశాఖ కంటి ఆస్పత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం నేత్ర పరీక్షలు చేసి పలువురికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని ఆస్పత్రి ప్రతినిధి వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్, బోసుబాబు, సుశీల గజేంద్ర రావు, మస్తాన్‌రెడ్డి, హనుమంతరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ థీమ్ పార్కు పనులు పరిశీలన

పెందుర్తి-రూరల్, జనవరి 28: జీవీఎంసీ 95వ వార్డు పరిధి సుజాతనగర్ సమీపంలోని రత్నగిరినగర్‌లో చేపట్టిన స్పోర్ట్స్ థీమ్ పార్కు (ఓపెన్ జిమ్) నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పాటిస్తూ త్వరితంగా దీనిని పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ఎ.గుణాకర్, బి.దేముడుబాబు, ఎస్.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జనవరి 28: చీమలాపురం, వేపగుంట, పురుషోత్తపురం పరిధిలో 11కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ డీవీ రమణమూర్తి తెలిపారు. ఈ కారణంగా వేపగుంట, చీమలాపల్లి, పొర్లుపాలెం, వరలక్ష్మీనగర్, గంగిరెడ్డికాలనీ, ముత్యమాంబకాలనీ, లక్ష్మీపురం, గవరపాలెం, చింతలగ్రహారం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేన్సర్ బాధితుడికి సాయం

అగనంపూడి, జనవరి 28: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడికి చెందిన కేన్సర్ బాధితుడు చోడవరపు గణేశ్‌ను ఆదుకునేందుకు సర్వహిత చారిటబుల్ ట్రస్టు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఆదివారం గణేశ్‌ను కలిసి నిత్యావసర సరకులను అందజేసింది. ట్రస్టు ప్రతినిధి పట్టా రామఅప్పారావు మాట్లాడుతూ ఆదపలో ఉన్న గణేశ్‌ను ఆర్థికంగా ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి గుదే సుశీలగజేంద్రరరావు, స్థానిక నాయకుడు జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 21, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళదుంపలు 17, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 24, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దొసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 26, కంద 54, దేముడుచిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

నిరుద్యోగుల ఆశలు ఆవిరి!

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28:

స్టీల్‌ప్లాంట్‌లో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఒకపక్క ఉద్యోగుల సంఖ్య నెల నెలకు తక్కువవుతుండడం.. మరోపక్క ఉన్న ఉద్యోగులనే ఏదో ఒక నెపంతో తొలగించేందుకు యాజమాన్యం సిద్ధపడుతుండడంతో అసలు నూతన నియామకాలు జరుగుతాయా అన్న సందిగ్ధత నెలకొంది. స్టీల్‌ప్లాంట్ ప్రారంభ సమయంలో విధుల్లో చేరిన ఉద్యోగుల్లో చాలామంది రెండు మూడేళ్లలో పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటికే అనేకమంది పదవీ విమరణ చేశారు. ఈ క్రమంలో ఉద్యోగుల సంఖ్య తక్కువ కావడంతో నూతన ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులంతా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

అయితే కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామన్న ప్రకటనకు తోడు ఇప్పటికే ఉన్న ఉద్యోగులను ఏదో ఒక కారణంతో తొలగించేందుకు సిద్ధం కావడంతో అసలు కర్మాగారంలో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క పోస్టుకు కూడా నోటిఫికేషన్ వెలువడలేదు. కనీసం కాంట్రాక్టు

స్టీల్‌ప్లాంట్‌లో నూతన నియామకాలపై సందిగ్ధత

ఉపాధి కోసం నిరీక్షిస్తున్న ఎనిమిది వేల మంది నిర్వాసితులు



కార్మికుల భర్తీని కూడా చేపట్టడం లేదు. ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల్లో ఇంకా ఎనిమిది వేల మందికి ఉపాధి కల్పించలేదు. వీరంతా ఎప్పటికైనా ప్లాంట్‌లో ఉపాధి లభిస్తుందని ఎంతో ఆశతో వేచి చూస్తున్నారు. ఇప్పుడు ఆ నమ్మకం కూడా సన్నగిల్లిపోతుందని పలువురు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో చివరిసారిగా నియామకాలు 2018లో చేపట్టారు. ఆ తర్వాత నుంచి ఆ ప్రసక్తే లేకుండా పోయింది. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పదవీ విరమణ చేస్తుండడంతో వారి సంఖ్య తగ్గుతుండడంతో పాటు ఉన్నవారిపై పని భారం అధికమవుతుంది. అందువల్ల తక్షణమే ఉద్యోగులను నియమించాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉక్కు యాజమాన్యం స్పందించాలి



ఉక్కు కర్మాగారంలో ఒకపక్క ఉద్యోగుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పని భారం చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యను యాజమాన్యానికి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ఉపాధి లభించలేదు. వారికి తగిన న్యాయం చేయాలి.

-జి.గణపతిరెడ్డి, కార్మిక నాయకుడు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై 7, 8 తేదీల్లో చలో ఢిల్లీ

ఉక్కు నిర్వాసిత సంఘం స్టీరింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం



'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలంటూ పాదయాత్ర నిర్వహిస్తున్న నిర్వాసితుల సంఘం నాయకులు

పెదగంట్యాడ, జనవరి 28: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిరసిస్తూ ఫిబ్రవరి 7, 8 తేదీల్లో చలో ఢిల్లీ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాలని ఉక్కు నిర్వాసిత సంఘం స్టీరింగ్ కమిటీ తీర్మానించింది. స్థానిక సీడబ్ల్యూసీలో ఆదివారం జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. స్టీరింగ్ కమిటీ నాయకుడు పులి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఇళ్లు, భూములు త్యాగం చేశామని, ఇప్పుడు ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు సిద్ధపడుతుందని.. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కమిటీ సభ్యుడు గొందేశి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్ట్రాటజికల్ సేల్ పేరిట స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం వంద శాతం విక్రయించేందుకు సిద్ధపడుతుందని, నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగులు, రాజకీయ పార్టీలు దీనిని తిప్పికొట్టాలన్నారు. సభ్యుడు గొందేశి సత్యారావు మాట్లాడుతూ చలో ఢిల్లీ ఆందోళన కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలన్నారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయబోమని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పిట్టా రెడ్డి, వై.చిన అప్పారావు, ఎన్.తాతారావు, ఎన్.రమణ, శ్రీముసిరి శ్రీనివాసరావు, అప్పలనాయుడు, కణితి అప్పలరాజు, ఎం.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాసిత కాలనీలో పాదయాత్ర చేపట్టారు.

ఉక్కు పరిరక్షణే మా శ్వాస-ధ్యాస

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగార పరిరక్షణే మా శ్వాస-ధ్యాస అని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,081వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపాధిని సృష్టించిన ప్రభుత్వ రంగాలను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, వేంకటేశ్వర్లు, పరంధామయ్య, గణపతిరెడ్డి, రామ్మోహన్, రామస్వామి, హెచ్ఎంఎస్ కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులకు టిడ్కో ఇళ్లు అందిస్తాం

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

వేపగుంట, జనవరి 28: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తామని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. 93వ వార్డు ప్రహ్లాదపురంలోని అరుణ కల్యాణ మండపంలో ఆదివారం టిడ్కో, గతంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా గృహాలు మంజూరు కాని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వాటిని కూడా లబ్ధిదారులకు అందించకపోవడం శోచనీయ మన్నారు. అర్హులైనప్పటికీ టీడీపీ సానుభూతిపరులను ఇళ్ల జాబితా తొలగించారని ఆరోపించారు. ఇప్పటికైనా లబ్ధిదారులంతా ఏకమై రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం బూత్ లెవెల్ కమిటీ సభ్యుల పనితీరును సమీక్షించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కాగా గతంలో టీడీపీ నుంచి వైసీపీకి వెళ్లి ఇప్పుడు మళ్లీ 'దేశం'లోకి వచ్చిన



సమావేశంలో మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

కర్రి నూకరాజుతో పాటు 30 మంది యువకులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, నాయకులు గంగ వరహాలు, పైడిరాజు, గాంధీ, వెంకటేశ్, యశస్వి, తదితరులు పాల్గొన్నారు.

గణబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిక

సింధియా: 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు సమక్షంలో 40వ వార్డు వైసీపీ మహిళా అధ్యక్షురాలు కుమారి, వైసీపీ నగర ప్రధాన కార్యదర్శి గణేశ్ మిశ్రాతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా వ్యతిరేక పాలన పట్ల ప్రజల్లోనే కాకుండా సొంత పార్టీలోనూ అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయన్నారు. వైసీపీ కేడర్ టీడీపీలో చేరేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఆర్ రాజు, రామారావు, నానాజీ, మనోహర్ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

90వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డుకు చెందిన పలువురు ఎమ్మెల్యే పి.గణబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి గణబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం

బైక్ ర్యాలీలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

గాజువాక, జనవరి 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అడ్డుకోవాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన సొంత ప్రయోజనాల కోసం వత్తాసు పలుకుతుండడం దారుణమన్నారు. గాజువాక నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం నిర్వాసితులు భూములిస్తే నేడు వారికి అన్నివిధాల అన్యాయం జరిగిందన్నారు.

గంగవరం పోర్టు ప్రభుత్వ రంగంలో ఉంటే ఉపాధి వస్తుందని ఆశించిన మత్స్యకారుల ఆశలు గల్లంతయ్యాయన్నారు. రూ.2,400 కోట్ల గంగవరం పోర్టు ఆస్తులను కేవలం రూ.560 కోట్లకు అమ్మేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉపాధి కోసం గాజువాక వచ్చి కొండ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదలకు వంద గజాల స్థలం ఇవ్వడానికి వైసీపీ పెద్దలకు చేతులు రావడం లేదని, అయితే తమ అవసరాలకు మాత్రం వందల ఎకరాలను ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉపాధి లేక ఎంతోమంది యువత ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్మార్గ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ





బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, జనసైనికులు. (ఇన్‌సెట్లో) ప్రజలకు అభివాదం చేస్తున్న కోన తాతారావు

కార్యక్రమంలో నాయకులు గడసాల అప్పారావు, దల్లి గోవిందరెడ్డి, తిప్పల వెంకటరమణారెడ్డి, కరణం కనకారావు, గంధం వెంకటరావు, కోన చిన అప్పారావు, మురళీ, దేవి, గోపీచంద్, తదితరులతో పాటు అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

88వ వార్డులో బైక్ ర్యాలీ..

గోపాలపట్నం: జనసేన-తెలుగుదేశం పార్టీ కూటమిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని జనసేన పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. 88వ వార్డు పరిధి నరవ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. గవర జగ్గయ్యపాలెంలో ప్రారంభమైన ర్యాలీ సత్తివానిపాలెం, కోటనరవ, నరవ, జెర్రిపోతులపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం, చింతగట్ల ప్రాంతాల మీదుగా సాగింది. అనంతరం ఇప్పిలివానిపాలెంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు జనసేనలో చేరగా, వారికి రమేశ్‌బాబు పార్టీ కండువాలు వేశారు.



జనసేనలో చేరిన వారితో పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు



పూజలందుకున్న బంగారుమాంబ

నాతయ్యపాలెంలో వైభవంగా బంగారుమాంబ పరస

అక్కిరెడ్డిపాలెం, జనవరి 28: నాతయ్యపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత బంగారుమాంబ అమ్మవారి పరసను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు, మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలతో ఊరేగించాక ఆలయంలో ప్రతిష్టించి పూజలు చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, మాజీ కార్పొరేటర్ జీవీ కృష్ణారావు, బి.సన్యాసిరావు, జి.వెంకటరమణ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, కోలాటాలు, తదితరమైనవి అందరినీ ఆకట్టుకున్నాయి.

సుజాతనగర్‌లో లక్ష్మీ నరసయమ్మ తీర్థం

పెందుర్తి: సుజాతనగర్ ప్రజల ఇలవేల్పు లక్ష్మీ నరసయమ్మ పరసను ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

తిరుమల నగర్‌లో స్వచ్ఛ భారత్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీలోని పార్కుల్లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్, తదితర ప్రాంతాలలో చెత్తా చెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించారు. రోడ్లను చీపుర్లతో శుభ్రపరిచారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, పరమానందం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, మూర్తి, సన్యాసిరావు, వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

సమష్టి కృషితో అభివృద్ధి సాధ్యం

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

పెదగంట్యాడ, జనవరి 28: అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున అన్నారు. ప్రభుత్వ నిధులు, దాతల సహాయంతో ఆధునీకరించిన పెదగంట్యాడ తహల్దార్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయానికి ఆధునీకరణ పనులు చేపడతామని అధికారులు తెలిపిన వెంటనే రూ.ఐదు లక్షలు మంజూరు చేశామని, ప్రభుత్వ నిధులకు తోడుగా స్థానికంగా పలువురు దాతలు కొంతమేర నిధులు సమకూర్చడం ప్రశంసనీయమన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు అధికారులు, సిబ్బంది మరింత చొరవ చూపాలన్నారు. రానున్నది ఎన్నికల కాలం కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలని, మంచి పనితీరునపి కనపరచాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నాడు-నేడు పనుల స్ఫూర్తితో ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధికి అధికారులు తీసుకుంటున్న చర్యలు హర్షణీయమన్నారు. కలెక్టర్ సహకారంలో నియోజకవర్గంలో 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేశామన్నారు. అనంతరం కార్యాలయ అభివృద్ధికి సహకరించిన దాతలను కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ కేఎస్ విశ్వనాధన్, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, తహశీల్దార్ రమాదేవి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బీఎన్ పాత్రుడు, పులి లక్ష్మీబాయి, శ్రావణి షిప్పింగ్ అధినేత సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

కూర్మన్నపాలెం, జనవరి 28: టీడీపీ చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితిలలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ శనివారం జరిగిన ఎన్నికల శంఖారావం సభలో విశాఖ రాజధాని గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మాట తప్పిన, మడమ తిప్పిన జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, వి.రాంబాబు, రాజన్ రాజు, ఎస్.కనకరాజు, మజ్జి అప్పారావు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: టీడీపీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మజ్జి మాలినాయుడు, సన్యాసిరావు, రాము, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా వెలుగుతున్న వీధి లైటు

రెండేళ్లుగా ఇదే తంతు.. అయినా పట్టించుకోని సిబ్బంది



ఎన్.ఎ.డీ జంక్షన్, జనవరి 28: రోజులు కాదు.. నెలలు కాదు.. ఏకంగా రెండున్నర సంవత్సరాలుగా ఆ వీధి లైటు రాత్రనక, పగలనకా వెలుగుతూనే ఉంటోంది. బుచ్చిరాజుపాలెంలోని గవరవీధిలో రెండున్నరేళ్లుగా రేయింబవళ్లు ఎల్ఈడీ లైటు వెలుగుతున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. గవరవీధిలో మాత్రం నిరంతరాయంగా ఎల్ఈడీ లైటు వెలుగుతుండడం శోచనీయం. సంబంధిత శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇక్కడి వీధి లైటు నిత్యం వెలుగుతూ ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'పశ్చిమ'లో మహిళా ఓటర్లే ఎక్కువ

మల్కాపురం, జనవరి 28: తుది ఓటర్ల జాబితా ప్రకారం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో మహిళా ఓట్ల సంఖ్యే అధికంగా ఉంది. నియోజకవర్గంలో మొత్తం 2,06,943 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 1,04,844 మంది మహిళా ఓటర్లు, పురుషులు 1,02,089 మంది, ఇతరులు పది మంది ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 40, 52, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 89, 90, 91, 92 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో మొత్తం 220 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 40వ వార్డులో ఆరు పోలింగ్ స్టేషన్లు, 52వ వార్డులో 16 పోలింగ్ స్టేషన్లు, 56వ వార్డులో 26, 57వ వార్డులో 21, 58వ వార్డులో 14, 59వ వార్డులో 17, 60వ వార్డులో 15, 61వ వార్డులో 15, 62వ వార్డులో 14, 63వ వార్డులో పది, 89వ వార్డులో 12, 90వ వార్డులో 17, 91వ వార్డులో 19, 92వ వార్డులో 22 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గం మొత్తంమీద 92వ వార్డులోనే ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది.

'గీతం' ఆధ్వర్యంలో ఉచిత కళ్లజోళ్లు పంపిణీ

ఆటోనగర్, జనవరి 28: గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో 70 వార్డు చట్టివానిపాలెంలో ఆదివారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ వార్డు ఇన్‌ఛార్జి చట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం గీతం విద్యా సంస్థల అధినేత శ్రీభరత్ ఆధ్వర్యంలో గత కొన్ని నెలలుగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు కళ్లకు శస్త్ర చికిత్సలు చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఏపీ వెల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చట్టి బాబు, టీడీపీ వార్డు కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఎం.పుల్లయ్య, ఎంఎస్ఎన్ రాజు, పీఎంఎల్ నాయుడు, రామకృష్ణ, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య గొడవ: కేసు నమోదు చేసిన పోలీసులు

మల్కాపురం, జనవరి 28: మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి మాజీ సైనికుల కాలనీలో రొంపిలి శంకరరావు, చల్లా కృష్ణ అనే ఇద్దరి వ్యక్తుల మధ్యనున్న పాత కక్షల నేపథ్యంలో శనివారం రాత్రి గొడవ జరిగింది. ఈ క్రమంలో కృష్ణ నేవీ మాజీ ఉద్యోగి అయిన శంకరరావు తలపై కర్రతో బలంగా కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ నుంచి మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు ఎంఎల్‌సీ రావడంతో సీఐ సన్యాసినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శంకరరావుపై గతంలో కృష్ణ అట్రాసిటీ కేసు పెట్టడంతో ఇద్దరి మధ్య కక్షలు పెరిగి గొడవకు దారి తీసిందని పోలీసులు పేర్కొంటున్నారు.

యారాడ రోడ్డులో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

మల్కాపురం, జనవరి 28: యారాడ రోడ్డులో ఆదివారం రాత్రి మల్కాపురం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గం గుండా వాహనాలపై రాకపోకలు సాగించే వారిని ఆపి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని సూచించారు. ఈ తనిఖీలను సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది నిర్వహించారు.

తుంగ్లాంలో రజకుల బల్లల పండగ

అక్కిరెడ్డిపాలెం, జనవరి 28: కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న రజకులు పార్టీలకతీతంగా ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి సూచించారు. తుంగ్లాం రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి బల్లలకు, ఇస్త్రీ పెట్టెలకు పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బల్లంకి అప్పారావు, టి.రామారావు, పి.అప్పారావు, పి.సాధూరావు, పి.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి'

అక్కయ్యపాలెం, జనవరి 28: గ్రూప్-2 కొత్త సిలబస్‌కు సంబంధించి ప్రభుత్వ ప్రామాణికమైన పుస్తకాలు లేకపోవడంతో ఈ ఉద్యోగాల భర్తీ వాయిదా వేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, టెట్ నోటిఫికేషన్‌తోపాటు డీఎస్సీ విడుదల చేయాలని లేదా, టెట్ టీఆర్టీ ఇవ్వాలన్నారు. డిగ్రీ కాలేజ్ లెక్చరర్ ఉద్యోగానికి పరీక్ష రాయాలంటే ఏపీ సెట్ క్వాలిఫై అయి ఉండాలని, అందుకోసం మరోసారి ఏపీ సెట్ నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని ఇప్పటి వరకునిలుపుకోలేదన్నారు. దీంతో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుతం తాజాగా మరో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం చేశారని, టెట్ నోటిఫికేషన్‌తోపాటు డీఎస్సీ నోటిఫికేషన్‌ను అభ్యర్థులు కోరుకుంటున్నారన్నారు. టెట్ ఫలితాలు వస్తే గానీ డీఎస్సీ పెట్టలేని పరిస్థితి ఉందని, 2022లో టెట్ నిర్వహించి ఇంతవరకు డీఎస్సీ పెట్టలేదని పేర్కొన్నారు. టెట్‌తో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష తేదీలు ఖరారు చేయాలన్నారు.

వాకర్స్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలకు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్, జనవరి 28 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్య నిపుణులు ఎం.రామరాజు పాల్గొని గుండె సంబంధిత, కీళ్ల సమస్యలపై రోగులకు చికిత్సలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఆహార నియమాలు పాటిస్తూ, నిత్యం వ్యాయామం చేయాలని రోగులకు సూచించారు. షుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవాలని కోరారు. వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎన్‌వైకేఎస్ సభ్యునిగా 'కొండా'



కొండా ప్రసాద్

అక్కయ్యపాలెం, జనవరి 28 : నెహ్రూ యువ కేంద్ర అడ్వయిజరీ బోర్డు (ఎన్‌వైకేఎస్) సభ్యునిగా యువమోర్చా రాష్ట్ర అధి కార ప్రతినిధిగా కొండ ప్రసాద్‌ను నియమిస్తూ యూత్ అఫైర్, స్పోర్ట్స్ కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి అడ్వయిజరీ బోర్డు సభ్యునిగా నియమించేందుకు కృషి చేసిన యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణకు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకు, జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథరాజుకు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సేవా రత్న పురస్కారాల ప్రదానం

అక్కయ్యపాలెం, జనవరి 28: రెండు దశాబ్దాలకు పైగా ఎంతో మందికి రక్తం అందించి తాసుబెల్లి ఫౌండేషన్ ప్రాణదాతలుగా నిలిచిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ కొనియాడారు. ఆదివారం నరసింహనగర్‌లోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వివిధ రాష్ట్రాల్లో రక్తదానంతోపాటు వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న 150 మందికి భారత సేవా రత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, టీడీపీ నాయకులు ఆడారి కిశోర్‌కుమార్, సంస్థ ట్రస్టీలు ఎర్రంశెట్టి సురేశ్, ఎస్.వెంకటలక్ష్మి, అఖిల్‌నాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పరిహార చెక్కు పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 28: అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణలో భాగంగా తాజ్‌బాబా మసీదుకు సంబంధించిన ఆస్తులు కొంతమేర నష్టం జరగడంతో వాటి నిర్మాణ విలువ ప్రకారం రూ.9.12 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం నుంచి మంజూరైనట్టు ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. ఈ మేరకు ఆయన సంబంధిత మసీదు పెద్దలకు ఆ చెక్కును ఆదివారం అందజేశారు. అలాగే రోడ్డు విస్తరణలో నష్టపోయిన స్థలానికి త్వరలో టీడీఆర్ మంజూరు చేస్తామని, దాని ద్వారా మసీదు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, వైసీపీ 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు బర్కత్ అలీ, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం జిల్లా బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పరుశురామ్‌రాజు



పరుశురామ్‌రాజు

సీతమ్మధార, జనవరి 28: భారతీయ జనతా పార్టీకి చెందిన పరశురామ్ రాజ్‌కు ఆ పార్టీ అధిష్ఠానం పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, అరకు తదితర నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. తనను నియమించిన నేతలకు కృతజ్ఞతలను తెలిపారు. పరుశురాం అరకు జిల్లా ఇన్‌చార్జిగానూ సేవలందిస్తున్నారు.

మొక్కు తీరకుండానే మృత్యుఒడికి..

▸▸ వ్యాన్ తొట్టి ఢీకొని యువకుడి మృతి

రాజమహేంద్రవరం,జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుడికి మొక్కు తీర్చుకుందామని వెళ్లిన ఆనందం ఆ కుటుంబంలో గంటల్లో ఆవిరై పోయింది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ పట్నం జిల్లా కొత్తగాజువాకకు చెందిన గొర్ల నాయుడు(26) స్థానికంగా ఏవీ అప్పారావు రోడ్‌లో నివాసం ఉండే అక్కాబావ దగ్గర ఉంటున్నాడు. తన బావ అప్పలనాయుడు సూపర్‌వైజర్‌గా పనిచేసే రెస్టారెంట్లో ఉద్యోగం చేస్తున్నాడు. మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కేశవరంలోని గుడికి వెళ్లాడు. ఏవో సరుకులు అవసరం కావడంతో రాజమహేంద్రవరం వచ్చి తీసుకెళుతున్నాడు. రాజవోలు రోడ్డులో వెళుతుండగా పక్కనే వెళ్తున్న పౌరసరఫరాల బియ్యం రవాణా చేసే వ్యాన్ తొట్టి వెనుక భాగం అతడి తలకు బలంగా తగిలింది. దీంతో నాయుడు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జుబేర్ తెలిపారు.



ఇంటిగ్రేటెడ్ శిక్షణలో గండి బాబ్జీ, నాయకులు



మాట్లాడుతున్న 24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు పద్మలత

'సిద్ధం' సభలో ఉత్తరాంధ్ర ఊసెత్తని జగన్

▸▸ టీడీపీ సౌత్ జోన్ ఇన్‌చార్జి గండి బాబ్జీ ధ్వజం

మహారాణిపేట, జనవరి 28: భీమిలి నియోజవర్గ పరిధిలోని సంగివలస వద్ద నిర్వహించిన సిద్ధం సభలో జగన్ ఉత్తరాంధ్ర ఊసెత్తకుండా ప్రసంగాన్ని పూర్తి చేయడం ఆయనకు ఈ ప్రాంతంపై అయనకు ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధం సభకు మూడు లక్షల మంది కాదని 30 వేల మంది మాత్రమే వచ్చారని ఎద్దేవా చేశారు. ఆయన ప్రకటించిన హామీలు ఎక్కడ అమలు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. జగన్ మద్య నిషేధం అమలు చేసి ఎన్నికలకు వెళ్తానని మాట ఇచ్చి మడమ తిప్పారన్నారు. విశాఖ రాజధాని కోసం సభలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎస్‌ఈజెడ్‌లో టీడీపీ హయాంలో మంజూరు చేసిన కంపెనీలను తమ గొప్పగా ప్రకటించారన్నారు. దేవుని దయ అంటూ ఆ దేవుని చెందిన సీబీఎస్‌సీ స్థలాలను దోచుకుని వాటాలుగా పంచుకున్నరని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను గాలికి వదిలేశారని, రైతులకు విద్యుత్ బిల్లులను మరింతంగా భారంగా మార్చారన్నారు. డిస్కమ్‌లకు రూ.80 వేల కోట్లు బకాయిలున్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి వైఖరిని ప్రజలు గుర్తించారని అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో ఇండిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంను ఆదివారం రామకృష్ణ మిషనరీ స్కూల్ వద్ద గండి బాబ్జీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయం కావాలి

సీతమ్మధార: రానున్న ఎన్నికల్లో టీడీపీ అమలుచేయనున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రేటర్ 24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత కోరారు. వార్డులో 'ఉత్తర' ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు ఆదేశాలపై 24, 25, 14వ వార్డుల్లోని పార్టీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అరాచకసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలన్నారు. క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు శిక్షణలో పాల్గొన్నారు. సెంట్రల్ పార్టీ నుంచి జేపీ రాజు, కె. కిశోర్, ఐటీపీ విశాఖ పార్లమెంట్ కోటా నరేశ్, 14వ వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు, 25వ వార్డు అధ్యక్షుడు నమ్మి రవి కుమార్, మాజీ కార్పొరేటర్ ఇసరప వెంకటలక్ష్మి, కోట్రాన దేముడుబాబు, వంగలపూడి నూకరాజు పాల్గొన్నారు.

గ్రేటర్ 26వ వార్డులో ఇంటి గ్రేటెడ్ శిక్షణ

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు చిన్నూరులోని టీడీపీ కార్యాలయంలో కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు. త్వరలో జరగనున్న సార్వత్రి ఎన్నికల సందర్భంగా ఓటర్ల వెరిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. త్వరలో పార్టీ అమలు చేయనున్న సూపర్ సిక్స్‌లో భాగంగా పథకాలను పార్టీ నియమించిన బృందం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ముక్కా కిశోర్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జి నరసింహారావు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ జరిగింది. వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిని సందర్శించిన రష్యన్లు



శ్రీవారి పూజల్లో రష్యన్లు

పెందుర్తి, జనవరి 28: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం పలువురు రష్యన్లు సందర్శించారు. ఆలయ ప్రాంగణంలోని దేవతామూర్తులను, గర్భాలయంలోని శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. వెంకటాద్రి శిఖరం ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. ఆలయ శిల్పకళా సౌందర్యాన్నికి ముగ్ధులయ్యారు. అనంతరం ఆలయ సన్నిధిలో వారు పురుషసూక్త పారాయణాన్ని పఠించారు.

పంచగ్రామాల సమస్య పరిష్కరించాలి



వేపగుంటలో ర్యాలీ చేస్తున్న యువకులు, గ్రామపెద్దలు

వేపగుంట జనవరి 28: వేపగుంట పరిసర ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న దేవస్థాన, ఉడా భూముల సమస్య ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీలకతీతంగా స్థానిక యువకులు, గ్రామపెద్దలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. తొలుత వేపగుంట ముత్యాలమ్మ గుడి నుంచి ప్రారంభమై ర్యాలీ వేపగుంట కూడలికి చేరింది. అక్కడ కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని కృష్ణరాయపురం వరకు కొనసాగించారు. 1903 గిల్‌మెన్ సర్వే ప్రకారం దేవస్థాన సమస్యను పరిష్కరించాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈసమస్య ఉన్నా పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. ఈస్థితిలో అన్ని పార్టీల నాయకులు ఈ విషయంలో సహకరించాలని కోరారు. ఈ ర్యాలీలో వార్డు కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, గ్రామపెద్దలు ముత్యానాయుడు, గంట్ల దేముడు, శేశెట్టి అప్పారావు, పిన్నింటి సత్యవతి, సాలాపు రమణ, తామడ నరసింగరావు, పెద్ద ఎత్తున యువత, రైతు సంక్షేమ సంఘ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాక్సింగ్ కౌన్సిల్ నూతన కమిటీ నియామకం



కమిటీకి నియామక పత్రాలందిస్తున్న మణిందర్ సింగ్

దొండపర్తి, జనవరి 28 : ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ నూతన కమిటీ నియామకమైంది. అధ్యక్షునిగా యల్లపు రఘురామ్, జనరల్ సెక్రటరీగా వాసుపల్లి అమ్మోరుతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ మేరకు వీరికి ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు మురధరణ్ రాజా ఆదేశాలమేరకు తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ మణిందర్ సింగ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీకి ప్రొఫెషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ జరుపుకునేందుకు లైసెన్స్ జారీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇప్పటికే రెండు ప్రొఫెషనల్ బాక్సింగ్ బౌట్స్‌లో పాల్గొని ర్యాంకింగ్ సాధించిన బాక్సర్లు కె.శ్రీను, భవానీ ప్రసాద్, గణేశ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గొర్లె చందు, డాక్టర్ బి.సునీల్, యల్లపు పృథ్వీ, వాడాడ రుబెన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఐఐఈ 67వ వార్షికోత్సవం



ఐఐఐఈ నూతన కార్యవర్గ సభ్యులు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఐఐఈ) వైజాగ్ చాప్టర్ 67వ వార్షికోత్సవాన్ని ఆదివారం నగరంలోని ఓ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ కౌన్సిల్ కార్యదర్శి ఏవీవీ ప్రసాద్‌రాజుమాట్లాడుతూ సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ పాత్రపై కీలకపోన్యాసం చేశారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్టక్చర్ వంటి అంశాల గురించి వివరించారు. అనంతరం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కౌన్సిల్ చైర్మన్‌గా జి.గాంధీ, వైస్ చైర్మన్‌గా ఎన్ వీఎస్ రాజు, కార్యదర్శిగా రామకృష్ణ దువ్వు, కోశాధికారిగా కేవీఎల్ఎన్ రాజు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.సుందరం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో చాప్టర్ చైర్మన్ వి.నారాయణణ్, స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) జి.గాంధీ పాల్గొన్నారు.

ఎక్కడ విఫలమయ్యాం?


... 5వ పేజీ తరువాయి

వేదిక వద్దకు వచ్చిపోయేందుకు వీలుగా రోడ్డు, సభకు హాజరయ్యే జనాల మధ్యకు ముఖ్యమంత్రి వెళ్లి మాట్లాడేందుకు వీలుగా ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక వంటి వాటి కోసం నాలుగు ఎకరాలు పోగా మిగిలిన పది ఎకరాలను జనాల కోసం సిద్ధం చేశారు. పది ఎకరాల్లో గరిష్ఠంగా 40 వేలు మంది మాత్రమే కుర్చీల్లో కూర్చొనేందుకు వీలుంటుందని భావించి, ముందుబాభాగంలో కుర్చీలు వేసి, వెనుక ఉన్న ప్రదేశాన్ని అలానే వదిలేశారు.

టార్గెట్ మరిచి ఏర్పాట్లు: మూడు లక్షల మందిని సభకు తరలించనున్నట్టు ప్రకటించిన వైసీపీ నేతలు సభకోసం ఎంపిక చేసిన స్థలంలో కేవలం 40 వేలు మంది మాత్రమే కుర్చునేందుకు వీలుంటుందనే విషయం తెలిసినప్పటికీ గుంభనంగా ఉండిపోయారు. తీరా సభ ప్రారంభయ్యే సరికి హాజరైనవారిలో కొందరు బయటకు వెళ్లిపోవడంతో వెనుకవైపు కుర్చీలు, ఇతర గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. సీఎం మాట్లాడుతుండగానే వేదికకు ఎదురుగా వెనుకవైపు ఖాళీగా ఉన్నకుర్చీలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్‌మీడియాలో ట్రోల్ అయిపోవడంతో వైసీపీ నేతలు డీలాపడిపోయారు. సభకు కనీసం మూడు లక్షల మందిని తరలిస్తామని గొప్పగా ప్రకటనలు చేసినవారంతా అధిష్ఠానానికి దీనిపై ఎలా వివరణ ఇచ్చుకోవాలో తెలియక తలలు పట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం కొందరు వైసీపీ నేతలు సభ జరిగిన తీరుతోపాటు, ఫీడ్‌బ్యాక్‌పై ఒకరినొకరు అడిగి తెలుసుకుంటూ అంతరంగికంగా సమీక్ష నిర్వహించుకున్నట్టు ఆపార్టీనేత ఒకరు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

నియోజకవర్గం నుంచి ఐదు వేల మందిని తేలేకపోయాం

ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాలు జిల్లా పరిధిలోనే ఉన్నందున ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం ఐదు వేల మందిని తరలించ గలిగినా సభా ప్రాంగణం నిండిపోయేదని నేతలు అభిప్రాయపడినట్టు చెబుతున్నారు. సభా ప్రాంగణంలో 30 వేల నుంచి 40 వేల మంది ఉంటే కిక్కిరిసిపోయి జనాలురోడ్లపైకి వచ్చేసేవారని అభిప్రాయపడినట్టు తెలిసింది. దీనిప్రకారం చూసుకున్నా భీమిలి నియోజకవర్గం నుంచి పదివేలు, మిగిలిన ఆరు నియోజకవర్గాల నుంచి కనీసం ఐదు వేల మందిని తరలిస్తే సభ హిట్ అయ్యేదని నగరంలోని ఓ ముఖ్యనేత అభిప్రాయపడినట్టు సమాచారం. నగర పరిధిలోని కొన్ని ప్రాంతాలకు కేటాయించిన బస్సుల్లో కనీసం ఐదు, పది మంది కూడా లేకుండానే సభాప్రాంగణానికి చేరుకున్నాయని నామినేటెడ్ పోస్టులో ఉన్న ఒక నేత చెప్పినట్టు సమాచారం. నగర పరిధిలోని మరికొన్ని ప్రాంతాలకు కేటాయించిన బస్సులను ఆయా వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు జనాలతో నింపడంపై దృష్టిపెట్టకుండా ముందుగానే సభాప్రాంగణానికి వెళ్లిపోవడం కూడా వైఫల్యానికి కారణమని జీవీఎంసీ పాలకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న నేత ఒకరు ముఖ్యనేతల వద్ద కుండబద్దలు కొట్టినట్టు చెప్పారని ప్రచారం జరుగుతోంది. భవిష్యత్తులోనైనా పార్టీ సభలు, సమావేశాలకు జనాల తరలింపుపై పూర్తిస్థాయిలో దృష్టిసారించకుండా, ఇప్పటిలాగే మహిళా సంఘాల సభ్యులు వస్తారనే ధీమాతో ఉంటే ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని నేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. లోపాలను అధిగమించుకోని పక్షంలో పార్టీ అధిష్ఠానం నుంచి అక్షింతలు వేయించుకోవడానికి సిద్ధంగా ఉండాలని ముఖ్యనేత ఒకరు తనవద్ద సభ గురించి ప్రస్తావించిన వారిని హెచ్చరించినట్టు తెలిసింది.



వేరే బూత్‌లో శివ దేవదులత అనే వ్యక్తి ఓటు



తొలగించిన 218 కేంద్రంలోని ఓ వ్యక్తి ఓటు



సీరపువీధిలో డబుల్ ఎంట్రీలో ఆరుగురి ఓట్లు

డబుల్ ఎంట్రీలు.. ఉన్నది ఒకచోట.. ఓటు మరోచోట

▸▸ 27వ వార్డు పరిధి ఓటరు జాబితాల్లో చిత్రవిచిత్రాలు

▸▸ ఓట్లు గల్లంతు పై స్థానికుల ఆగ్రహం

'ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. ఓటుతో తలరాత మార్చుకో.. సచ్చీలురైన నేతలను ఎన్నికల్లో గెలిపించుకోవడంలో ఓటే కీలకం.. ఓటరూ మేలుకో.. మీకున్న హక్కును సద్వినియోగం చేసుకుని మంచి సమాజ నిర్మాణానికి దోహదపడండి' ఇవన్నీ వీలున్నచోటల్లా అధికారులు నిత్యపారాయణంలా పఠిస్తుంటారు.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి తప్పులుతడకల జాబితాలతో జనాలను గందరగోళంలోకి నెడుతున్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితో ఇష్టారీతిగా ఓట్ల తొలగింపుపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈస్థితిలో గ్రేటర్ విశాఖ 27వ వార్డులో వెలుగుచూసిన కొన్నిలోపాలు ఇవి..

దొండపర్తి, జనవరి 28: గ్రేటర్ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఓట్లు గల్లంతయ్యాయి. ఓటర్ల జాబితాల్లో కొంతమంది పేర్లు లేకపోవడంతో వారంతా అవాక్కవుతున్నారు. మరికొంతమందికి చెందిన ఓట్లు వేరే పోలింగ్ బూత్‌ల్లో చేర్చారు. ఇటీవల వరకు తమ ఓట్లు తాముంటున్న పరిసర పోలింగ్ బూత్‌ల పరిధిలోనే ఉండేవని, కానీ ప్రస్తుతం వేరేచోట్లకు మార్పు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొన్నిచోట్ల కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో కాకుండా వేర్వేరు చోట్ల ఉండడంపై మండిపడుతున్నారు. వార్డు పరిధిలోని 218 పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన 48-5-39/1 డోర్ నంబరుకు చెందిన పిల్లి శ్రీనివాసరెడ్డి (23) ఓటు 216 పోలింగ్ బూత్‌లో నమోదైంది. ఆయన కుటుంబ సభ్యుల ఓట్లన్నీ 218 పోలింగ్ బూత్‌లోనే కొనసాగుతున్నాయి. అలాగే, 218 పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన 48-6-13 నంబరుకు చెందిన దేవదులత శివ (36) ఓటు ఏకంగా తొలగించారు. కానీ, ఆయన మాత్రం అదే డోర్ నంబరులో నివశిస్తున్నారు. ఆ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్వో ఒక్కరోజు కూడా ఓటర్ల జాబితా తనిఖీ చేయలేదని ఆరోపిస్తున్నారు. ఆమె సెలవుపై వెళ్లిపోవడంతో మరొకరిని ఆ స్థానంలో భర్తీ చేయకుండానే ఎలా నిర్ధారించారో ఎవరికి అర్థం కావడంలేదని పలువురు వాపోతున్నారు.

దొండపర్తి సీరపువీధిలో ఉన్న 224 పోలింగ్‌బూత్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి ఓట్లను మళ్లీ జాబితాలో చేర్చారు. ఇలాకొనసాగితే అర్హులెవరూ రానున్న ఎన్ని కల్లో ఓట్లు వినియోగించుకోనే పరిస్థితి ఉండదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల గల్లంతుపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో బెంబేలెత్తించిన యువకులు

▸▸ అడ్డుకున్న కానిస్టేబుల్‌పై దాడికి యత్నం



కృష్ణానగర్ వద్ద కానిస్టేబుల్‌పై దాడికి యత్నిస్తున్న యువకులు

వేపగుంట జనవరి 28: నాయుడు తోట కృష్ణానగర్ బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆదివారం కొందరు యువకులు కార్ల ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రయాణికులను భయభ్రాంతికి లోనుచేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలివి.. యువకులు కార్లల్లో మురళీనగర్ నుంచి పెందుర్తివైపు వెళుతున్నారు. వీరు ఎస్‌పీడీ నుంచి పరిమితికిమించి వేగంతోపాటు జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేస్తూ ముందుకు సాగారు. వీరి వాహనాలను చూసి జనాలు ఆందోళన చెందారు. ఈ క్రమంలో నాయుడుతోట వైపు వస్తున్న కానిస్టేబుల్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టే ప్రయత్నంచేశారు. దీంతో ఆ కానిస్టేబుల్ వాహనాన్ని నిలిపి వారిని ప్రశ్నించారు. లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలు చూపాలనికోరారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న యువకులంతా ఒక్కసారిగా కానిస్టేబుల్‌పై బెదిరింపులకు దిగారు. వెనుక వస్తున్న కార్లలో ఉన్న యువకులతో కలిసి కానిస్టేబుల్‌పై దాడికి ప్రయత్నించారు. దీంతో కొందరు స్థానిక యువకులు వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో ఓ యువకుడు కానిస్టేబుల్ వాహనం కీ పట్టుకుపోయాడు. దీంతో వెంటనే కానిస్టేబుల్ పెందుర్తి పోలీసులకు, ట్రాఫిక్ పోలీసులకు అలెర్ట్ చేసి ఎరుపు రంగులో వెళ్తున్న కారును అడ్డుకోవాలని మెసేజ్ పెట్టారు. ఆ కారును ఎట్టకేలకు సుజాతానగర్ కూడలిలో పట్టుకున్నారు. అందులో ప్రయాణిస్తున్న యువకులను పెందుర్తి ఎస్ఐ రమేష్ వద్దకు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. కానిస్టేబుల్‌కు క్షమాపణలుచెప్పించారు. యువకుల భవిష్యత్తుకు ఇబ్బంది కలుగుతుందని వారిని వారందరిని హెచ్చరించి పంపేశారు.

'మహా' బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

ఇతరులకు సబ్‌లీజ్‌కు ఇవ్వడం చేసుకోవచ్చు. దీనిప్రకారం ప్రస్తుతం బీచ్‌రోడ్డులో హోర్డింగ్స్, లాలీపాప్ యాడ్స్‌తోపాటు, మరో రెండు ప్రధాన రోడ్లపై లాలీపాప్ యాడ్స్‌కు ఏడాది కిందట టెండర్ గడువు ముగిసింది. తర్వాత వాటిని ఆర్ఎఫ్‌పీ పిలిచి, టెండర్ ఆహ్వానించాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులు కొన్ని లాలీపాప్ యాడ్‌బోర్డులకు మాత్రమే టెండర్ పిలిచి, మిగిలిన వాటితో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై సుమారు 70 వరకూ కాంటిలీవర్ హోర్డింగ్‌లను నామినేషన్ పద్ధతిలో కేటాయించేయడం అప్పట్లో వివాదాస్పదమైంది. నగరంలోని మిగిలిన యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు జీవీఎంసీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ చీఫ్ సిటీప్లానర్‌ను కలిసి అభ్యంతరం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా అప్పగిస్తారంటూ నిలదీయడంతో వారికి తలాకొన్ని బోర్డులు ఇస్తామంటూ బుజ్జగించారు. తాజాగా మరో యాడ్ ఏజెన్సీకి నగరంలోని పలురహదారులపై కాంటిలీవర్ యానిపోల్ హోర్డింగ్‌ల ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు నామినేషన్ పద్ధతిలో అనుమతించారంటూ నగరంలోని యాడ్ ఏజెన్సీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కచ్చితంగా టెండర్ పిలిచిన తర్వాత ఎవరు ఎక్కువకు కోట్‌చేస్తే వారికి కేటాయించాల్సిన హోర్డింగ్‌లను ఏకపక్షంగా ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు అడిగినా జీవీఎంసీ అధికారులు దాచిపెడుతున్నారని, సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా ప్రయోజనం కనిపించడం లేదని వాపోతున్నారు.

రూ. పది కోట్ల ఆదాయానికి గండి:

నగరంలోని ప్రధాన రోడ్లపై హోర్డింగ్‌లు, లాలీపాప్ యాడ్ బోర్డుల ఏర్పాటుకు టెండరు పిలిస్తే జీవీఎంసీకి సుమారు రూ.పది కోట్లు ఆదాయం సమకూరేదని యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. టెండర్ ప్రస్తావన లేకుండా అస్మదీయులైన యాడ్ ఏజెన్సీకి కట్టబెట్టేస్తుండడంతో ఆదాయం కోల్పోయినట్టేనన్నారు. మరోవైపు జీవీఎంసీ అధికారులు కూడా సంస్థకు ఆదాయం పెంచేందుకు తామంతా కష్టపడి పనిచేస్తుంటే... ఉన్నతాధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అమలుకు సహకరించాలనిఒత్తిడిచేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు.

భవిష్యత్తులో ప్రమాదాలకు ఆస్కారం

రోడ్డు మధ్యన ఉండే సెంటర్ మీడియన్లపై ఏర్పాటుచేసే కాంటిలీవర్ యూనిపోల్ హోర్డింగ్‌లు భవిష్యత్తులో ప్రమదాలకు కారణమవుతాయని పోలీస్ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో హోర్డింగ్ ఎత్తు సుమారు 34 అడుగులు ఉంటుందని, పోల్‌పైన హోర్డింగ్ ఎత్తు 12 అడుగులు, వెడల్పు 30 అడుగులు ఉంటుందని, భవిష్యత్తులో తుపాన్లు, పెనుగాలులు సంభవించే సమయంలో హోర్డింగ్‌లు ఎగిరిపడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా అలాంటి బోర్డులు ఏర్పాటుచేసేచోట రోడ్డు వెడల్పు కనీసం వంద అడుగులుండాలని, అప్పుడే రోడ్డుపై వెళ్లే వాహనచోదకులకు దూరంగా ఉండే వాహనాల రాకపోకలు, రోడ్డు పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు. కానీ నగరంలో ఎక్కడా కనీసం కిలోమీటరు పొడవున తిన్నగా ఉన్నరోడ్డుగాని, వంద అడుగులు వెడల్పు ఉన్న రోడ్డుగానీ లేనప్పటికీ సుమారు 90 ప్రాంతాల్లో కాంటిలీవర్ యూనిపోల్ హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం సరికాదంటున్నారు. వీటన్నింటినీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోకుండా అస్మదీయుల సేవలో తరిస్తూ జీవీఎంసీ ప్రయోజనాలు, నగరవాసుల భద్రతను గాలికి వదిలేయడం దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

24 గంటల్లో డోర్ డెలివరీ

... 5వ పేజీ తరువాయి

అందుబాటులోకి తేనున్నారు.


ప్రస్తుతం 50 కిలోలకు పరిమితం: ప్రస్తుతం 50 కిలోల వరకు బరువున్న పార్శిల్స్‌నుమాత్రమే పీటీడీ డోర్ డెలివరీ చేస్తు న్నది. వచ్చే ఏడాది జనవరి నుంచి దీనిని వంద కిలోల వరకు పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలు సమకూర్చుకుంటోంది.

డోర్ డెలివరీ చేస్తున్న పట్టణాలు

రాష్ట్రంలో కర్నూలు, అదోని, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు, అనంతపురం, ధర్మవరం, గుత్తి, గుంతకల్, హిందూపురం, కదిరి, రాయదుర్గం, తాడిపత్రి, కడప, బద్వేల్, బమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, రాయచోటి, చిత్తూరు, మదనపల్లి, పుత్తూరు, తిరుపతి, కుప్పం, పలమనేరు, పీలేరు, శ్రీకాళహస్తి, ఒంగోలు, కందుకూరు, మార్కాపురం, అద్దంకి, గిద్దలూరు, కనిగిరి, పొదిలి, నెల్లూరు, కావలి, వెంకటగిరి, గుంటూరు, నరసారావుపేట, పిడుగురాళ్ల, పొన్నూరు, రేపల్లె, తెనాలి, వినుకొండ, బాపట్ల, చిలకలూరిపేట, విజయవాడ, అవనిగడ్డ, గుడివాడ, జగ్గయ్యపేట, మచిలీపట్నం, నూజివీడు, ఏలూరు, భీమవరం, జంగారెడ్డి, గూడెం, కొవ్వూరు, పాలకొల్లు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు, తుని, అన్నవరం, సామర్లకోట, విశాఖపట్నం, అనకాపల్లి, గాజువాక, నర్సీపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పాలకొండ, పలాస, సాలూరు, నరసన్నపేట లాజిస్టిక్స్ కేంద్రాల నుంచి పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తున్నారు.

పెరుగుతున్న ఆదాయం: గత ఆర్థిక సంవత్సరంలో రూ.77.01 కోట్లు ఆదాయం రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.77.69 కోట్లు ఆదాయం వచ్చింది. 11 శాతం పెరిగినట్టు లెక్కలు తేల్చారు. డోర్ డెలివరీ విధానంతోనే ఆదాయంలో పెరుగుదల వచ్చిందని అభిప్రాయపడుతున్నారు.


హౌస్ షిఫ్టింగ్ చేస్తాం



విశాఖ నుంచి ఇతర ప్రాంతాలు, ఇతర ప్రాంతాల నుంచి విశాఖకు ఇల్లు మారాలనుకునేవారి గృహోపకరణాలు, ఫర్నిచర్ తదితర సామగ్రిని రవాణా చేస్తాం. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా, అలాగే ఏప్రాంతం నుంచి అయినా ఉత్తరాంధ్ర జిల్లాలకు షిఫ్టింగ్ చేస్తాం. ఒకరోజు ముందుగా తెలియజేస్తే తరలించాల్సిన సామగ్రిని భద్రంగా ప్యాకింగ్ చేయిస్తాం. ప్యాకేజీ, తరలించడానికి అయ్యే రుసుమును వారికి తెలియజేస్తాం. సామగ్రి బరువును అంచనా వేసి రుసుము నిర్ణయిస్తాం.

- బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్), విజయనగరం జోన్

అవకాశాలను వినియోగించుకుంటున్నాం



లాజిస్టిక్స్ విభాగం నుంచి అధిక ఆదాయం పొందేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నాం. పార్శిల్స్ రవాణా, డోర్ డెలివరీ, హౌస్ షిఫ్టింగ్, కార్గో రవాణా సౌకర్యాలు అందిస్తాం. ప్రైవేటు రవాణా సంస్థల కంటే తక్కువ చార్జీతో నాణ్యమైన సేవలందిస్తాం. లాజిస్టిక్స్ ఆదాయంలో విజయనగరం జోన్ మంచి స్థానంలో ఉంది.

-సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయనగరం జోన్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జనవరి 28 : మారికివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మారికివలస కూడలి, మారికివలస, బిస్లరీ వాటర్ కంపెనీ, బోరవానిపాలెం, మారికివలస జేఎన్ఎన్ యుఆర్ఎం కాలనీ, డంపింగ్‌యార్డ్, జేకే లేఅవుట్, టొయోటో షోరూం, కొత్తపరదేశిపాలెం, పాతపరదేశిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఆరిలోవ : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని కైలాసగిరి 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. బీఎస్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతవాక జంక్షన్ కొండవాలు ప్రాంతం. రెవెన్యూ కాలనీ, విశాలాక్షినగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

'డ్వాక్రా మహిళా మార్టు' ప్రారంభం

పద్మనాభం, జనవరి 29 : పద్మనాభం మండల పరిషత్ కార్యాలయం సముదాయంలో డ్వాక్రా సభ్యుల వాటాధనంతో నిర్మించిన చేయూత మహిళా మార్టును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన కౌంటర్లను, సామగ్రిని పరిశీలించి, వినియోగదారులకు నాణ్యమైన సరకులు సరఫరా చేసి అందరి మన్ననలు పొందాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఏర్పాటు చేసిన 17వ మహిళా మార్టు కాగా, సొంత భవనం సమకూర్చుకున్న రెండో మహిళా మార్టు కూడా ఇదేనన్నారు.

నేడు స్పందన

భీమునిపట్నం, జనవరి 28 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు జడ్సీ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21వ వార్డులో ఎంపీ పాదయాత్ర



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

పెదవాల్తేరు, జనవరి 28 : వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి మద్దతుగా నివాలని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన 21వ వార్డులోని విద్యానగర్, రెల్లివీధి, తమిళస్ట్రీట్ ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార చైర్మన్ పేర్ల విజయచంద్ర, నాయకులు అల్లంపల్లి రాజబాబు, చొక్కర శేఖర్, బొండా శ్రీను, కాశి, కమల్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ బీచ్‌లో అంధకారం

సాగర్‌నగర్, జనవరి 28 : సాగర్‌నగర్ బీచ్‌లో కొన్ని రోజులుగా అంధకారం నెలకొంది. దీంతో బీచ్‌కు వస్తున్న వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జీ 20 సదస్సుల నేపథ్యంలో గతంలో బీచ్‌లోని కొబ్బరి చెట్లకు, స్తంభాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో తీరమంతా వెలుగులతో కళకళలాడేది. ఇటీవల వాటిని తొలగించడంతో అంధకారం నెలకొంది. దీంతో చీకటి పడిన తరువాత ఇటువైపు రావాలంటే స్థానికులు భయపడుతున్నారు.

ఎండాడలో కళ్లద్దాలు పంపిణీ

ఎండాడ, జనవరి 28 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి కంటి ఆపరేషన్లు చేయించుకున్న 20 మందికి ఆదివారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ సేవా సమితి ట్రస్టు, స్వర్గీయ ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు ఈ కళ్లద్దాలను సమకూర్చింది.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 21, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారేట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబటి 24, ముల్లంగి 18,నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 26 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 100
ఫారం ధర	-- 120
విత్ స్కిన్	-- 210
స్కిన్‌లెస్	-- 220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

శిథిలావస్థలో పద్మనాభం వంతెన

- ఏళ్ల తరబడి నిర్వహణ కరువు
- గోతులతో రోడ్డు
- రాకపోకలకు ప్రజల అవస్థలు



గోస్తనీ నదిపై శిథిలావస్థలో ఉన్న వంతెన

పద్మనాభం,జనవరి 28 : పద్మనాభం - శొంఠ్యాం ఆర్అండ్‌బీ రోడ్డులోని పద్మనాభం సమీపంలో గోస్తనీ నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. విశాఖపట్నం,విజయనగరం జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ఈ వంతెన మీదుగా నిత్యం 60 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణాలు చేస్తుంటారు.ఇంతటి ప్రాధాన్యత ఉన్న వంతెన కొన్నేళ్లుగా నిర్వహణ లోపం వల్ల అధ్వానంగా ఉంది. వంతెనపై ఉన్న రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. బ్రిడ్జి పిల్లర్ల జాయింట్ వద్ద ఉన్న ఇనుప బద్దె ఊడి బయటకు కనిపిస్తోంది. వార్షిక నిర్వహణలో భాగంగా ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఏటా ఇటువంటి వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా కనీసం పట్టించుకోలేదు. ఇనుప బద్దె పైకి లేవడం వల్ల వాహనాల టైర్లు పాడవ్వడమే కాకుండా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ చాలావరకు పాడైంది. దీంతో వాహనదారులు వంతెన మీదుగా రాకపోకలకు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వంతెన మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం

- టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్
- చిట్టివలసలో జయహో బీసీ సదస్సు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీభరత్, కోరాడ రాజబాబు

తగరపువలస, జనవరి 28 : వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరిగిందని, దాన్ని సవరించడానికి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి, గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీభరత్ అన్నారు. ఆదివారం చిట్టివలస బంతాట మైదానంలో 1,2,3 వార్డులు, భీమిలి రూరల్ మండలాలకు సంబంధించి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఓట్లతో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించి, తాతా థియేటర్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు డి. అప్పలనర్సింహరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి,విశాఖ పార్లమెంటు కార్యదర్శి పిట్ట సురేష్,బీసీ సెల్ నాయకులు రాము, ఆనందబాబు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆదాయ మార్గాలను చూపుతాం

ఎంవీపీ కాలనీ : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తానని టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఎం. శ్రీభరత్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన ఎంవీపీ కాలనీలోని మోడల్ రైతుబజారును సందర్శించారు. రైతుల వద్ద కొన్ని కూరగాయలు కొనుగోలు చేశారు. వారితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రైతులకు ఆదాయ మార్గాలను పెంచే దిశగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మినీ మేనిఫెస్టో కరపత్రాలు చూపిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, శ్రీభరత్

రామ్‌నగర్‌లో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

రామ్‌నగర్, జనవరి 28 : రామ్‌నగర్‌లో టీడీపీ నాయకులు ఆదివారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బంగారమ్మమెట్ట, న్యూ పితానివీధి, దమ్ముగారి వీధుల్లో పర్యటించి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, క్లస్టర్ ఇన్‌చార్జి నక్కా కనకరాజు, సన్యాసిరావు, ఆల్సీ అప్పలనారాయణ, గోవిందరావు కొండలరావు, శ్యామల, మంగమ్మ, ఢిల్లీశ్వరి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, జనవరి 28 : జీవీఎంసీ 13 వార్డు శ్రీకాంత్‌నగర్‌నకు సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ధర్మారావు, 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం. 11వ వార్డు అధ్యక్షుడు రాజారావు, నాయకులు యల్లమి సురేష్, రమణి, ఒమ్మి పోలారావు, బాలస్వామి పాల్గొన్నారు.

ఆనందపురంలో పూర్వ విద్యార్థుల కలయిక



పాఠశాల ఆవరణలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆనందపురం, జనవరి 28 : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా వారు నాటి ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు గత మధురస్మృతులను గుర్తుచేసుకుంటూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం పాఠశాలకు 20 సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జనవరి 28 : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క పసిడి కుసుమంతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే వరాహలక్ష్మీనృసింహస్వామికి గరుడ సేవను ఘనంగా జరిపారు.

జీవీఎంసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

ఆరిలోవ, జనవరి 28 : ముడసర్లోవ పార్కులో ఆదివారం జీవీఎంసీ క్లాస్ ఫోర్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. అప్పుడే ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఉద్యోగులు సీహెచ్ రామనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమనాంలో ఆధ్యాత్మిక ప్రచారం



ఆధ్యాత్మిక ప్రచారంలో ప్రభోత సేవా సమితి సభ్యులు

భీమునిపట్నం (రూరల్), జనవరి 28 : మండలంలోని అమనాం, జీరుపేట, గొల్లలపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. సమితికి చెందిన కె. త్రినాథరావు ఆధ్వర్యంలో సభ్యులు ఇంటింటికి వెళ్లి పండుగల విశిష్టత, ఆలయాల్లో పూజా విధానాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కృష్ణ, లక్ష్మి, సురేష్, కె. కళావతి, కె. రాజు పాల్గొన్నారు.

నేడు ఎన్ఎంఎంఎస్ విద్యార్థులతో జేసీ సమావేశం

తగరపువలస, జనవరి 28 : చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథం సమావేశం కానున్నట్టు ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రేఖ అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి జేసీతో పాటు డీఈఓ చంద్రకళ, సర్వశిక్షా అభియాన్ జిల్లా అధికారి శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. తమ సంస్థ ద్వారా పరీక్షకు హాజరైన వారిలో 50 మంది ఎంపికయ్యారని చెప్పారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు



జనసేన పార్టీలో చేరిన వారితో వంశీకృష్ణ

మద్దిలపాలెం, జనవరి 28 : జీవీఎంసీ 28, 7వ వార్డులకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వారికి శివాజీపాలెంలోని తన కార్యాలయంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ కష్టపడి పని చేసే నాయకులకు వైసీపీలో గుర్తింపు లేదన్నారు. జగన్ మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. భీమిలి సభలో అక్కడి అభ్యర్థి పేరు కూడా ప్రకటించలేని పరిస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. పాదయాత్ర సమయంలో చెప్పిన విషయాలే ముఖ్యమంత్రి జగన్ మళ్లీ మళ్లీ చెప్పారని ఎద్దేవాచేశారు. ఎంవీవీ తూర్పులో చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి లక్ష్మీనారాయణ, తెలుగు జయ ప్రకాష్, రంజిత్‌కుమార్, కండపల్లి రాజు, పురుకుటి చందు, వంకర వినోద్, శ్రీను, రాజేష్, చిన్నమ్మలు, బాయన గణేష్, సత్యనారాయణ, మంగి వంశీకృష్ణ, దుర్గాప్రసాద్, హరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కొట్లాటలో ఒకరికి తీవ్ర గాయాలు

మల్కాపురం, జనవరి 28 : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి మాజీ సైనికుల కాలనీలో రొంపిలి శంకరరావు, చల్లా కృష్ణ అనే ఇద్దరి వ్యక్తుల మధ్యనున్న పాత కక్షల నేపథ్యంలో శనివారం రాత్రి గొడవ జరిగింది. ఈ క్రమంలో కృష్ణ నేవీ మాజీ ఉద్యోగి అయిన శంకరరావు తలపై కర్రతో బలంగా కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ నుంచి మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు ఎంఎల్‌సీ రావడంతో సీఐ సన్యాసినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శంకరరావుపై గతంలో కృష్ణ అట్రాసిటీ కేసు పెట్టడంతో ఇద్దరి మధ్య కక్షలు పెరిగి గొడవకు దారి తీసిందని పోలీసులు పేర్కొంటున్నారు.

సందడిగా పర్యాటక ప్రాంతాలు

భీమునిపట్నం, జనవరి 28 : భీమిలి బీచ్‌కు సందర్శకులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. నగరం నలుమూలలతో పాటు ఆనందపురం, పద్మనాభం, తగరపువలస, విజయనగరం, భోగాపురం, మధురవాడ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది పర్యాటకులు రావడంతో సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. కొందరు ఇసుక తెన్నెలపై, మరికొందరు సముద్ర స్నానాలు సందడి చేశారు.

జూకు రూ. 3.51 లక్షల ఆదాయం

ఆరిలోవ : జూపార్కు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. నాలుగు వేల మంది పర్యాటకులు జూపార్కును సందర్శించగా వారి వద్ద నుంచి సుమారు రూ. 3.51 లక్షల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.



సాగర కన్య బొమ్మ వద్ద సందర్శకులు



బస్సులో చిరిగిపోయి ఉన్న సీట్లు

అధ్వానంగా దేవస్థానం బస్సు

సింహాచలం, జనవరి 28 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన బస్సు సీట్లు చిరిగిపోయి అధ్వానంగా ఉండడంతో భక్తులు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. సీఎస్ఆర్ నిధులు రూ. 9 లక్షలతో ఎస్‌బీఐ సింహాచలం శాఖ భక్తుల సౌకర్యార్థం 2020లో ఈ బస్సును సమకూర్చింది. నాటి నుంచి బస్సులో ప్రయాణాలు సాగించిన భక్తుల ద్వారా అప్పన్న ఖజానాకు లక్షలాది రూపాయల ఆదాయం వస్తోంది. అయితే బస్సు నిర్వహణ పట్ల దేవస్థానం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బస్సు లోపల అనేక సీట్లు చిరిగిపోగా, కొన్నిచోట్ల పెద్ద పెద్ద కన్నాలు పడి ఉన్నాయి. కొన్ని సీట్లకు వెనుక భాగాన రెస్టులు లేకపోవడంతో పాటు డ్రైవర్ సీటులో కూడా స్పాంజి సీటు లేక అట్టముక్కతో సరిపెట్టుకోవలసిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై ట్రాన్స్‌పోర్టు విభాగానికి చెందిన ఉద్యోగిని ప్రశ్నించగా రిపేర్లు నిమిత్తం అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశామని చెప్పారు.

రహదారి మధ్యలో గొయ్యి



సాగర్‌నగర్, జనవరి 28 : సాగర్‌నగర్ కాలనీ ఎంఐజీ ఎ గృహ సముదాయంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ వద్ద రోడ్డు మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై స్థానికులు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

కులగణన సర్వేకు సర్వర్ ఇబ్బందులు

మధురవాడ, జనవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే ఆదివారంతో పూర్తయింది. అయితే సర్వర్ ఇబ్బందుల వల్ల సచివాలయ సిబ్బంది అవస్థలు పడ్డారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే సర్వర్ వేగంగా పనిచేసింది. మిగతా సమయాల్లో మందకొడిగా కొనసాగింది. దీంతో సగం మంది వివరాలు తీసుకోలేకపోయారు. జోన్-2లో 5 నుంచి 13 వార్డుల వరకు 91 సచివాలయాలను 1819 క్లస్టర్లుగా విభజించారు. ఇందులో సుమారు 95,973 కుటుంబాలు ఉన్నాయి. 2,84,027 మంది కుటుంబ సభ్యులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వలంటీర్‌తో పాటు సచివాలయ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరించారు. ప్రతి ఇంటికి కనీసం 45 నిమిషాల సమయం పట్టింది. అయితే సర్వర్ లోపం వల్ల చాలాచోట్ల వివరాలు సరిగ్గా నమోదు చేయలేకపోయారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం, జనవరి 29 : మహిళా సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభంలో ఆదివారం ఆయన స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణమాఫీ కోసం రూ. 40 కోట్లు పంపిణీ చేశామన్నారు. అనంతరం మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ పాప, ఎంపీటీసీ సభ్యులు పైడినాయుడు, సూరప్పడు, నాయకులు పదు, ఆదిబాబు, ఈశ్వరరావు, వైకేపీ ఏరియా కోఆర్డినేటరు సత్యంనాయుడు, డీపీఎంలు వైదేహి, అరుణ, ఏపీఎంలు ప్రభాకర్, వల్లయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆనందపురం : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన పెద్దిపాలెంలో జగనన్న హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. అలాగే వేములవలస, గంభీరం, ఎల్వీ పాలెం పంచాయతీల్లో సుమారు రూ. 1.5 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీ మజ్జి శారాదా ప్రియాంక, సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ, నాయకులు బంక సత్యన్నారాయణ, బి. మణిశంకర్‌నాయుడు, పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ 'పల్లెకు పోదాం' శిక్షణ తరగతులు

పెదవాల్తేరు, జనవరి 28 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు ఆదివారం నుంచి పల్లెకు పోదాం (గావ్ ఛలో అభియాన్) శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పూడి తిరుపతిరావు మాట్లాడుతూ పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ప్రతి కార్యకర్త రోజుకో గ్రామంలో పర్యటించి, అక్కడి సమస్యలు తెలుసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, సోషల్ మీడియా ఇన్‌చార్జి శివకాంత్, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎస్. విజయానందరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, జీసీ నాయుడు, ఏఎస్ రామ్మోహన్, గావ్ ఛలో అభియాన్ జిల్లా కన్వీనర్ శ్రీరంగం ధనేశ్వరరావు, చల్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ రోడ్డులో పెరిగిపోయిన తుప్పలు



సుభాష్ రోడ్డులోని ప్రైవేటు స్థలంలో పొదలు

భీమునిపట్నం, జనవరి 28 : జోన్ వన్ 3వ వార్డులోని సుభాష్ రోడ్డు తుప్పలు పేరుకుపోవడంతో పాముల భయం నెలకొంది. ఈ రోడ్డులో పలుచోట్ల తుప్పలు ఉండడంతో పాముల సంచారం అధికమైంది. దీంతో చీకటి పడిన తరువాత ఇటువైపు రాకపోకలు సాగించేందుకు స్థానికులు భయపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి తుప్పలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధం : కోరాడ

సింహాచలం, జనవరి 28 : ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. ఆదివారం ఆయన 98వ వార్డు కార్పొరేటర్ పీవి నరసింహంతో కలిసి ఇక్కడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ దురాగతాలకు చరమగీతం పాడేందుకు సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధమని జగన్ బృందం చెబుతుండగా ఆ పార్టీని భూస్థాపితం చేసేందుకు ఓటర్లు ఇప్పటికే మానసికంగా సిద్ధమై ఉన్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వారితో పాటు వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సిరిపురపు సురేష్, పట్నాల ధర్మరాజు, ఎంకె గోపాల్, నరసింహమూర్తి రాజు ఉన్నారు.